# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com



లోపలి పేజీలో



సూర్యప్రభవాహనంపై ఊరేగిన శ్రీ కల్యాణ వెంకన్న..


కడప | సంపుటి:01 | సంచిక:95 | మంగళవారం | ఫిబ్రవరి 25, 2025 | ఎడిటర్:రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు :8 | వెల:రూ 5/-

published from Kadapa, Kakinada, Vijayawada, Ananthapuramu, Eluru Circulated at AndhraPradesh & Telangana


# కూలిపోయే కోటలో కుట్రలెన్నెన్నో..

-కోట గదిలో కుట్రలకు
ఆజ్యం పోస్తుంటే..
-కిక్కెక్కి కారు
కూతలు
కూస్తుంటే..

-కన్న తల్లి కూడా కంటకన్నీరు
కారుస్తుందేమో..
-మాతృ స్థానంపై మత్తెక్కి
మాయమాటలు కూస్తుంటే..
-మనిషి పుట్టుకకే అసహ్యం
పుట్టిస్తుంటే ..
-మృగాల కంటే హీనంగా
మధమెక్కి ప్రవర్తిస్తుంటే..
-తల్లడిల్లి పోదా తల్లుల
ప్రపంచం..
-త్రాగుడు కోసం తల్లి,చెల్లిల పై
కూడా తప్పుడు కూతలు
కూస్తుంటే..
-వీరికుండే కళలే వేరు ...మళ్ళీ
వీరే సకల కళలకు సై అంటుంటే..
-ఆకోట కూలేదెన్నడో.. ఈ కుట్రలు
ఆగేదెన్నడో..
-అక్కడ ఉన్నదంతా
పండితులేనని ప్రచారం...
వారి పాండిత్యం చూస్తే..
-ప్రయాణిస్తున్న రైలులో పొగమంటలు
పుట్టిచ్చినట్లు
-రంగానాయకిలో షీరాతో
చీవాట్లు తిన్నా..
-పిండాలు పెట్టడానికి వెళ్లిన పాడు
ఆలోచనలనే ఉంటే..
-మేడిపండు మనస్సుతో
ముంచుతుంటే..
-ఈ మర్మాలు తెలియక
మోసపోతుంటుంటే..
-ఓ కాలమా ఏమిటే ఈ పోగాలం..."

ప్రజాభూమిప్రతినిధి, క్రైం, కృష్ణసింధు

యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః"ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు చరిస్తారు, ఎక్కడ స్త్రీలను పూజించరో అక్కడ జరిగే సత్కర్మలకు విలువ ఉండదు అంటోంది మన సంస్కృతి. త్రిమూర్తులకు మూలమైన ఆదిపరాశక్తి స్త్రీ. ప్రకృతిని స్త్రీరూపంగా చెప్పాయి వేదాలు. మాతృదేవోభవ అని తల్లిని ప్రత్యక్ష దైవంగా పూజించమన్నారు ఋషులు. భారతీయ సమాజంలో మహిళలకు మొద టి నుంచీ ఉన్న గౌరవనీయ స్థానం ఇది.. పురుషులతో సమానంగా, ఇంకా చెప్పాలంటే కాస్త ఎక్కువ ప్రాధాన్యతే మహిళలకు ఉంది.

మిగతా 2లో



-కోట్లున్నాయంటూ
కూల్చిన
కొంపలెన్నో..
-గనులున్నా
యంటూ గలీజు
పనులు చేస్తే..
-మామిడి పాకలు
న్నాయంటూ
మాయలు చేస్తే..

# తప్పుడు పనుల కోసమే ఆ ట్రస్ట్ పుట్టిందా..?

ప్రజాభూమిప్రతినిధి, క్రైం, కృష్ణసింధు

-తాగి తాగి తకిట తకిట
తందానా అని..
-తల్లుల తాళి బొట్టుతో సహా
తాకట్టు పెట్టి తప్పించుకుంటె..
-ఆ బిడ్డ నా బిడ్డే అంటూ బ్లాక్
మెయిల్ చేసి బ్రతికితే..
-మందు కోసం మందిని
ముంచితే..
-సినిమా కోసం అంటూ
సర్వస్వం దోచుకుని పోతే..
-అన్నదానం పేరిట అమాయకు
లను అప్పనంగా దోచేస్తే..
-లోపం వాడిదే అయి అందరిని
పాపాల్లోకి దింపితే..
-వాడి రూపం ఒకటి అసలు
రూపం ఇంకొకటి అయితే ..
-హైదరాబాద్ టూ అమరావతి
వరకు అన్యాయమయిపోతే..
-అన్నొచ్చి అమాయకంగా
ఆటలాడుతుంటే..
-మురగా వాడు మమ్మల్ని
ముంచెసాడని
మొత్తుకుంటుంటే..
-ప్రాణం లేక పోయిన పైసలు
బదిలీ అవుతుంటే..
-ఆయువు పోయిన అకౌంట్స్
చెలామణీ చేస్తుంటే..
-ఆడది అంటే ఆట బొమ్మగా
చేసి ఆడుకుంటే..
-వాడి మందే వాడిని
వైకుంఠం చేర్చినా..
-తమ్ముడి పాపాలను అన్న
ఆపాదించుకొంటాడా..
-అన్నా..ఓ..అన్నా..ఇంకెన్ని
మోసాలన్నా ...

పూర్తి వివరాలు వచ్చే సంచికలో

# అసెంబ్లీ నేటికి వాయిదా

-ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన గవర్నర్ అబ్దుల్ నజీర్
-గవర్నర్ ప్రసంగం ముగిసిన వెంటనే వాయిదా పడ్డ సభ
-సభ నుంచి వాకౌట్ చేసిన వైసీపీ

2



## ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పదవికి, టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి జీవీరెడ్డి రాజీనామా

## 11 నిమిషాలు ఉండటానికి 11 మంది ఎమ్మెల్యేలతో వచ్చారా?: వైఎస్ షర్మిల



2

## తెలుగు రాష్ట్రాల్లో మరో ఎన్నికలకు నగారా...

తెలంగాణలో ఐదు, ఏపీలో ఐదు..

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల..



# బడ్జెట్ సమావేశాలకు వెళ్లొద్దు..ఎమ్మెల్యేలకు జగన్ ఆదేశం

ప్రజాభూమిప్రతినిధి,తాడేపల్లి:-

నేటి నుంచి శాసన సభ సమావేశాలకు హాజరు కాకూడదని వైఎస్సార్సీపీ అధ్యక్షుడు జగన్ నిర్ణయించారు. వైఎస్సార్సీపీ ఎమ్మెల్యేలు సైతం సభకు వెళ్లకుండా దూరంగా ఉండాలని జగన్ ఆదేశించారు. అసెంబ్లీకి వెళ్లకుండా ప్రెస్ మీట్లు పెట్టి సమస్యలను ప్రజలకు వివరిస్తానని తెలిపారు. శాసన సభను బాయ్‌కాట్ చేసి వెళ్లిన అనంతరం తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జగన్ సమావేశమయ్యారు. వైఎస్సార్సీపీ కౌన్సిల్‌లో మంచి మెజార్టీ ఉంది కాబట్టి దీన్ని వినియోగించుకోవాలని జగన్ ఆదేశించారు. ఎమ్మెల్సీలంతా శాసన మండలికి వెళ్లి ప్రజల సమస్యలపై పోరాటం చేయాలని నిర్దేశించారు.ప్రతిపక్ష హోదా విషయంలో అధికార పార్టీ వైఖరిని ప్రజలకు తేటతెల్లం చేసేందుకే ఇవాళ అసెంబ్లీకి వెళ్లినట్లు తెలిపిన జగన్ ప్రతిపక్ష హోదా ఇస్తే హక్కుగా తనకు సమయం ఇవ్వాల్సి వస్తుందని అన్నారు. సభా నాయకుడికి దాదాపు సమాన స్థాయిలో సమయం ఇవ్వాల్సి ఉంటుందని నేతలతో జగన్ అన్నారు. అందుకనే ప్రతిపక్ష హోదాను ఇచ్చేందుకు ముందుకు రావడం లేదని వివరించారు.

మిగతా 2లో

# ఐదేళ్లలో ప్రతిపక్ష హోదా రాదు

-అలా అంటే జర్మనీకి వెళ్లండి
-ప్రతిపక్ష హోదా ఇవ్వలేదంటూ జగన్, వైసీపీ ఎమ్మెల్యేల వాకౌట్
-మీడియా పాయింట్ వద్ద సెటైర్లు వేసిన పవన్ కల్యాణ్

ప్రజాభూమిప్రతినిధి,అమరావతి:-

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గతంలో ప్రభుత్వంలో ఉన్నామని.. ఇప్పుడు ప్రతిపక్ష ఇవ్వాలని కోరితే ఇవ్వడం ఉండదని అన్నారు. అసెంబ్లీ రెండో అతిపెద్ద పార్టీగా జనసేన ఉందని తెలిపారు. కనీసం జనసేన కన్నా ఒక్క సీటు ఎక్కువ వచ్చినా కూడా వారికి ప్రతిక్ష హోదా దక్కేదని అన్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగుపెడతామని అనడం సరైనది కాదని పేర్కొన్నారు. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈరోజు ఉదయం ప్రారంభమయ్యాయి. గవర్నర్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించారు. అయితే గవర్నర్ ప్రసంగం మొదలుపెట్టగానే... వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని కోరుతూ ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నినాదాలు




చేశారు. ఆ తర్వాత కాసేపటికి అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. ఇక, గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత అసెంబ్లీ వాయిదా పడింది.అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ... వైసీపీ తీరును తప్పుబట్టారు. గవర్నర్ ప్రభుత్వం తరపున సందేశాన్ని ముందుకు తీసుకెళ్తున్న సమయంలో వైసీపీ వ్యవహరించిన తీరు బాగోలేదని విమర్శించారు.

మిగతా 2లో

ప్రజాభూమి

## బడ్జెట్ సమావేశాలకు వెళ్లొద్దు..

మొదటిపేజీ తరువాయి

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని జగన్ ఆరోపించారు. అన్యాయంగా ఇళ్లపట్టాలు రద్దు చేస్తున్నారని జగన్ దృష్టికి ఎమ్మెల్యేలు,



ఎమ్మెల్సీలు తీసుకు రాగా ఎవరైనా ఇళ్లు కట్టుకోకపోతే ప్రభుత్వం వారికి ఇళ్లు మంజూరు చేసి ఇవ్వాలని, అంతేగాని పేదలపై కక్ష కట్టి పట్టాలు రద్దుచేయడం ఏంటని ప్రశ్నించారు. పట్టాలు రద్దు చేస్తే తప్పకుండా కోర్టును ఆశ్రయిస్తామని జగన్ స్పష్టం చేశారు.



## విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులుగా పుచ్చ ఈశ్వరరావు నియమించిన రాష్ట్ర పార్టీ

ప్రజాభూమి పలాస:

రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు చీపురుపల్లి నియోజకవర్గంలో మాజీ మంత్రివర్యులు, ప్రస్తుత ఎంఎల్ఏ కళావెంకటరావు గారి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల విస్తృత స్థాయి సమావేశంలో ఎన్నికల పరిశీలకునిగా రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు శుక్రవారం నాడు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఫిబ్రవరి 27 న జరగబోయే ఎమ్మెల్సీ ఎలక్షన్లో కూటమి ఉమ్మడి అభ్యర్థి పాకలపాటి రఘువర్మ గారిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మరియు అభ్యర్థి గెలుపుకు నియోజకవర్గం లోని 4 మండలాల లోని 309 ఓటర్లను పార్టీ శ్రేణులు కలసి అందరూ సమిష్టి కృషితో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకత్వం, నియోజకవర్గం లోని మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు ,పార్టీ క్లస్టర్ మరియు యూనిట్ ఇన్చార్జులు, వజ్రపుకొత్తూరు మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ , కూటమి నాయకులు పాల్గొన్నారు.




## ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పదవికి, టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి జీవీరెడ్డి రాజీనామా

ప్రజాభూమిప్రతినిధి,అమరావతి:-

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే టీడీపీకి చెందిన ముఖ్యనేత జీవీ రెడ్డి గుడ్ బై చెప్పేశారు. ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పదవికి.. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం రాజీనామా లేఖను సీఎం చంద్రబాబు నాయుడుకు పంపించారు. వ్యక్తిగత కారణాలతోనే ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పదవికి....పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఏ రాజకీయ పార్టీలోకి వెళ్లేది లేదు అని లేఖలో పేర్కొన్నారు. ఇకపోతే జీవీ రెడ్డి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్‌గా సీఎం చంద్రబాబు నాయుడు నియమించారు. చైర్మన్ హోదాలో ఏపీ ఫైబర్ నెట్‌లో జరుగుతున్న లోపాలను బహిర్గతం చేసిన సంగతి తెలిసిందే. ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి...ఏపీ ఫైబర్ నెట్ ఎండీ దినేశ్‌ల మధ్య వార్ నడుస్తోంది. ఇటీవలే ఎండీ దినేశ్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారమే జీవీ రెడ్డి రాజీనామాకు కారణంగా తెలుస్తోంది.

**చంద్రబాబు భేటీ అనంతరం రాజీనామా..**ఎండీ దినేష్ కుమార్ ఐఏఎస్ ఆగస్టులో చార్జి తీసుకున్నారు..చార్జ్ తీసుకున్న తర్వాత ఒక్క రోజు కూడా ఫైబర్ నెట్‌పై ఫోకస్ చేయలేదు అని చైర్మన్ జీవీ రెడ్డి ఆరోపించారు. గత అధికారులతో కుమ్మక్కు అయ్యారా అన్న సందేహం వస్తోంది.. మా ప్రభుత్వం వచ్చాక ఫైబర్ నెట్‌కు ఒక్క రూపాయి రాలేదు అని ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి ఆరోపించారు. ఒకానొక సందర్భంలో రాజద్రోహం అనే పదం వాడారు. ఈ వ్యాఖ్యలపై ఐఏఎస్‌ల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో జీవీ రెడ్డి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

## 11 నిమిషాలు ఉండటానికి 11 మంది ఎమ్మెల్యేలతో వచ్చారా?: వైఎస్ షర్మిల

ప్రజాభూమిప్రతినిధి,అమరావతి:-

జనాలు ఛీకొడుతున్నా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు జగన్ తీరు మాత్రం మారడం లేదని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. నేడు అసెంబ్లీకి వచ్చింది 11 మంది ఎమ్మెల్యేలతో కలిసి 11 నిమిషాలు ఉండేందుకా? అని నిలదీశారు. ప్రజా సమస్యల కన్నా జగన్‌కు ప్రతిపక్ష హోదానే ముఖ్యమా సభ్యత్వాలు రద్దవుతాయనే భయంతో అటెండెన్స్ కోసం వచ్చారా అని ప్రశ్నించారు.కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడానికి జగన్‌కు ప్రతిపక్ష హోదానే కావాలా అని షర్మిల అన్నారు. ప్రజల శ్రేయస్సు కంటే పదవులే ముఖ్యమని అసెంబ్లీ సాక్షిగా నిరూపించుకున్నారని మండిపడ్డారు. వైఎస్సార్సీపీ సభ్యులకు పదవులు ముఖ్యం కాదు అనుకుంటే ప్రజాసమస్యల మీద చిత్తశుద్ధి ఉంటే మంగళవారం నుంచి అసెంబ్లీకి వెళ్లాలని హితవుపలికారు. సభకు వెళ్లే దమ్ము లేకపోతే తక్షణం పదవులకు రాజీనామాలు చేయాలని షర్మిల పేర్కొన్నారు.గవర్నర్ ప్రసంగంలో పసలేదు: మరోవైపు గవర్నర్ ప్రసంగంలో పసలేదని షర్మిల విమర్శలు గుప్పించారు. సూపర్ సిక్స్ హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన లేదని ఆక్షేపించారు. హామీల అమలు కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు గవర్నర్ ప్రసంగం నిరాశను మిగిల్చిందని షర్మిల అన్నారు. కొత్త సీసాలో పాత సారా అనే సామెత లెక్క కూటమి మ్యానిఫెస్టోనే గవర్నర్ చదివారు తప్పిస్తే కొత్త అంశాలు ఒక్కటి లేవని షర్మిల మండిపడ్డారు.

## తెలుగు రాష్ట్రాల్లో మరో ఎన్నికలకు నగారా...

ప్రజాభూమిప్రతినిధి,అమరావతి:-

తెలుగు రాష్ట్రాల్లో మరో ఎన్నికలకు నగారా మోగింది. ప్రస్తుతం తెలంగాణలో, ఆంధ్రప్రదేశ్‌లలో పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు ఈ నెల 27న పోలింగ్ జరగనుంది. తాజాగా ఏపీలో, తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు షెడ్యూల్ విడుదలైంది. తెలంగాణలో ఐదు, ఆంధ్రప్రదేశ్‌లలో ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం (ఫిబ్రవరి 24) రోజున షెడ్యూల్ విడుదల చేసింది.

ఆంధ్రప్ర దేశ్‌లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా ఉన్న దువ్వారపు రామారావు, పరుచూరి అశోక్ బాబు, తిరుమలనాయుడు, యనమల రామకృష్ణుడుల పదవీకాలం ఈ ఏడాది మార్చి 29తో ముగియనుండగా, జంగా కృష్ణామూర్తి పదవీకాలం ఈ ఏడాది మార్చి 15తో ముగియనుంది. దీంతో ఈ ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా షెడ్యూల్ విడుదల చేసింది.తెలంగాణలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా ఉన్న మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, షేరి సుభాష్ రెడ్డి, ఎగ్గే మల్లేశం, మీర్జా రియాజుల్ హాసన్‌ల పదవీకాలం ఈ ఏడాది మార్చి 29తో ముగియనుంది. దీంతో ఈ ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా షెడ్యూల్ విడుదల చేసింది. నోటిఫికేష్ విడుదల, నామినేషన్ల స్వీకరణ ప్రారంభం - 2025 మార్చి 3 (సోమవారం) నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ - 2025 మార్చి 10 (సోమవారం) నామినేషన్ల పరిశీలన - 2025 మార్చి 11 (మంగళవారం) నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ - 2025 మార్చి 13 (గురువారం) పోలింగ్ తేదీ, సమయం - మార్చి 20వ తేదీ (గురువారం), ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు, ఓట్ల లెక్కింపు - మార్చి 20వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభం.

# కూలిపోయే కోటలో కుట్రలెన్నెన్నో..

మొదటిపేజీ తరువాయి

మన దేశాన్ని భారత మాతగా కొలుస్తున్నాం.. మన పురాణాలను గమనించినట్లైతే దుర్గామాత, పార్వతి, పోచమ్మ ఎల్లమ్మ తదితర దేవతలను శక్తికి ప్రతీకగా, సరస్వతి, లక్ష్మిలను చదువు, సంపదకు గుర్తులుగా పూజిస్తాం..దురదృష్టవశాత్తు మన దేశంపై విదేశీయుల దండయాత్రలు మొదలయ్యాక పరిస్థితి మారింది.. ప్రజల ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది.. మరోవైపు మూఢనమ్మకాలు పెరిగాయి.. దీంతో స్త్రీలను ఇంటికే పరిమితం చేయడం మొదలు పెట్టారు.. అయినా రాణి రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీభాయి, చెన్నమ్మ తదితర వీర వనితలు తమ శక్తి సామర్థ్యాలను చాటుకున్నారు..ఇక ఆధునిక యుగంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు ధీటుగా దూసుకుపోతున్నారు.. రాజకీయ, పరిపాలన, వ్యాపార రంగాల్లో ఎందరో మహిళలు ఉన్నత స్థానంలో ఉన్నారు.. అయినా ఎక్కడో లోపం.. ఇవన్నీ పైపై మెరుగులేనా అనిపిస్తుంది.. .. పొద్దున్నే పేపర్ తెరచినా, టీవీ ఛానళ్లు చూసినా ప్రముఖంగా కనిపించే వార్తలు బాధను కలిగిస్తుంటాయి.. మహిళలపై వివక్ష దారుణంగా కొనసాగుతోంది.. బాల్య వివాహాలు, అవిద్య చాలా మేరకు తగ్గినా, మహిళలపై అత్యాచారాలు, హింస, వరకట్న వేధింపులు చూస్తుంటే మనం నిజంగా అనాగరికులమేనా అనే సందేహం కలుగుతుంది.. సామాజికంగా, రాజకీయంగా వివక్ష దారుణంగా ఉంది.. రాజ్యాంగం ఇచ్చిన రిజర్వేషన్ల పుణ్యమా అని పదవులు మహిళలకు దక్కినా పెత్తనం మాత్రం పురుషులదే.. అత్యున్నత స్థానంలో ఉన్న మహిళలదీ ఇదే దుస్థితి.మనం ఆధునికులం అని చెప్పుకుంటున్నాం.. కానీ మన ఆలోచనా విధానం పూర్తిగా అనాగరికంగా ఉంది.. స్త్రీని భోగ వస్తువుగానే చూస్తున్నాం.. సినిమాలు, టీవీలు, పత్రికల్లో కనిపించే దృశ్యాలను ఎలా అర్థం చేసుకోవాలి? మన పిల్లలకు, యువతకు ఎలాంటి సందేశం ఇస్తున్నాం? మహిళల కట్టు, బొట్టు గురుంచి కామెంట్ చేయడం గౌరవ ప్రదం అనిపించుకోదు.. పురుషుల వస్త్రధారణ మారినట్లుగానే మహిళలదీ మారుతోంది అని నా అభిప్రాయం.. ఈ విషయంలో స్త్రీలను ఎంత తప్పు పడుతున్నామో, పురుషులకూ అంతే బాధ్యత ఉంది.. ఇంతటి బాధ్యత గౌరవంఉన్న ఈ సమాజంలో ఒక ఊరులో కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న ఓ కోట ఉంది.ఆ కోటలో ఆడవారి మానం పై మానవ మృగాలు మత్తెక్కి చేస్తున్న ముష్టి పనులపై పాత్రలు,వివరాలు పరోక్షంగా కల్పిత పాత్రలతో ఈ సమాజానికి అందిస్తున్న ప్రత్యేక కథనం... అది ఒక మహా పట్టణంగా పేరుగాంచబోతుంది.అటువంటి మహానగరంలో మానవత్వం ఉన్న ఓ మహనీయుడు ఈ కోటను నిర్మించడానికి కానుకల ద్వారా అంటే చందాల ద్వారా సొమ్ము సేకరించి అందమైన కట్టడాలు నిర్మాణం చేయడం జరిగింది.కేవలం విశ్రాంతి, వివిధ రంగాల వారు వారి దుస్తులు మార్చుకుని వెళ్లుటకు కొంత సమయం ఉండటానికి,ఎదయున కార్యక్రమం చేసు కోవడానికి వెసులుబాటు గా ఏర్పాటు చేశారు. అది కాలక్రమేణా పట్టణం అభివృద్ధి చెందుతూ ఉండటం వ్యాపార కేంద్రంగా మారి దేనికోసం ఆ నిర్మాణం చేపట్టారో అది పూర్తిగా విరుద్ధంగా అక్కడ కార్యకలాపాలు జరిగేవిదంగా తయారు కావడం ఆ కోట చేసుకున్న పాపంగా చెపుకోవాలి. ఇలాంటి కోటలో కొన్ని గదులు ఆ కోటలో జరగవలసిన కార్యక్రమాలకు సంబంధించిన వారు కాకుండా నడిమంత్రపు సిరి అన్న చందాన కొందరు అక్కడ స్థావరం ఏర్పాటు చేసుకుని అక్కడ ఏమి జరిగినా వారి అనుమతి అజ్ఞానుసారం జరిగేలా అక్కడ ఏర్పాట్లు చేసుకుని ఉన్నారు.అయితే ఆ కోటలోకి కామాతురాణాం నభయం నలజ్జ అన్న తీరుగా కొందరు తమ వికృతానందం కోసం గుమికూడి పైశాచిక ఆనందం కోసం సాఫీగా సాగుతున్న రైలు ప్రయాణం లో ఒక్కసారిగా పొగ మంటలు వచ్చి ఆ రైలు ప్రయాణాన్ని చిన్నాభిన్నం చేసినట్లు గా ఆడవారి జీవితాలను చిన్నాభిన్నం చేయడమే పనిగా పెట్టుకున్నారు. సాదారణంగా ప్రాచీన కాలం నుండి చూస్తున్నట్లు గానే మత్తు అనేది ఏ విదంగా చేస్తుందో తెలిసిన విషయమే.అయితే అవి కొన్ని యాదృచ్ఛికంగా అయితే ఇక్కడ మాత్రం పిండాలు పెట్టె దగ్గర కూడా పైట కొంగు వైపు చూసే దౌర్భాగ్యపు మనుషులున్నారనేది నిజం.

ఇలాంటి తరుణంలో సాఫీగా సాగుతున్న రైలు ప్రయాణం లో చిన్న చిన్న అలజడి జరగడం సాధారణమే.అయితే ఈ కోట లాంటి రైలులో ఒక కొత్త బిచ్చగాడు తనకు తానే ఒక అరవింద స్వామి అనే అందగాడు అనుకుంటూ ఓ సీటు దక్కించుకున్నాడు. ఇంకేముంది నా సీటు గాలేదు మీ సీటు ఇస్తారా అని అడగడం సీటు ఇచ్చారా ఇక ఆ సీటు చిరిగి పోయినట్లే. ఇక ఆరోజు ప్రయాణం ముగిసిన వెంటనే కోటకు చేరుకోవడం రైలు లో జరిగిన ప్రయాణ దృశ్యాలు వింత వింత గా వివరించి చెప్పడం.మత్తెక్కి మర్మం కూడా లేకుండా తల్లి జన్మ స్థానం పై కూడా కారుకుతలు కూస్తూ ఉంటే కోట గోడలు కూడా కన్నీటితో కలతచెంది ఇంకెప్పుడు ఈ కోట కూలిపోతుందా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తుంటే ఈ కసాయిలు ఆనందంగా నవ్వుకుంటూ ఉంటారు.ఇక తెల్లారి మళ్ళీ రైలు ప్రయాణం లో ఏ సీటు కాళీ ఉందా కాళీ లేకున్నా ఆసీటు ఎలా దక్కించుకోవాలని చూసి రంగానాయకి చేతిలో చిక్కి షీరాతో చొక్కాలు పట్టుకుని తన్నులు తిన్నా తిక్క కుదరక పోయే. ఎన్ని జరిగినా రాత్రి కోటకు చేరుకోవడం కిక్కెక్కేటట్లు త్రాగడం కారుకూతలు కూయడం పరిపాటిగా మారింది.అయితే అప్పటి వరకు రైలు ప్రయాణం లో ఉన్న ప్రయాణికులు కొంత వరకు మాత్రమే ప్రయాణం చేసి చీ ఈ ప్రయాణం తెలియక చేసామని తప్పు తెలుసుకుని దిగిపోయారు. ఈ నేపథ్యంలో అనుకోకుండా రైలు ప్రయాణం తప్ప ఇతర ప్రయాణం చేయలేని ఒక ప్రయాణానికురాలు అదే రైలు ఎక్కి ఓ సీటు లో కూర్చొంది. ఇంకేముంది సీటు కాళిలేక పోయిన ఏదో ఒక రకంగా ఆ సీటు లో కూర్చొనే వాడు ఈ ప్రయానికురాలి సీటుపై కన్నేసి ఆహా ఈ సీటు లో ఉంటే ఇంత సుఖవంతమైన ప్రయాణం ఉంటుందని ఊహించలేదని నమ్మించి చివరి గమ్యం ఈ రైలు చేరేంత వరకు నీ ప్రయాణం కు తోడుగా ఉంటానని చెప్పి నమ్మబలికాడు. సరే నా ఒంటరి ప్రయాణం లో ఏమి ఇబ్బందులు వస్తాయని దేవుడు మనిషి రూపంలో ఇలా తోడు చేశాడని ఆ పిచ్చి తల్లి ప్రయాణం సాగిస్తూనే ఉంటే ఈమాయగాడు ఆ ప్రయాణికురాలి కష్టాని తింటూ కోటకి రావడం కారుకూతలు కూయడం సాదారణమే అయింది. అయితే ఈ కసాయి వాడు ఆ సీటు లో ఉన్నంత సేపు మాత్రమే అనంత విశ్వంలో అద్భుతాలు ఉన్నాయని అంటూనే ఏ సీటు కాళీ ఉందా అంటూ వెతకడమే పనిగా పెట్టుకున్నాడు.ఈ ప్రయాణికురాలు ఏమిటి వెతుకుతున్నారు అంటే చీ ఆ సీటు లో ఉన్నవారు మంచి వారు కాదు..వామ్మో నీవే నన్ను కాపాడాలని అంటే ఈ పిచ్చి ప్రయానికురాలు వారిని తన్నడం కూడా చేసి తిప్పలు తెచ్చుకుంటే ఈ మాయగాడు మాత్రం అమాయకుడులాగా ఉంటూ ఏంతో నమ్మకంతో తన కష్టంతో సంపాదించుకున్న రైలు సీటును దూరం చేయాలని చూస్తున్న విషయం ఆ కోట లోని వారికి తెలిసిన త్రాగుడు మైకం లో తిక్క కూతలు వింటూ తాత్కాలిక ఆనందం పొందుతూ మేడిపండు మనస్సులతో ముందుకు పోతుంటే ఈ అమాయక ప్రయాణికురాలు ఆవేదన తో అల్లాడి పోతుంది.ఇక ఈసీటు లో ఇతనికి చోటు ఇచ్చి ఇంత తప్పు చేసి తిప్పలు తెచుకున్నానని గ్రహించి సీటు నుండి దూరంగా వస్తే ఏకంగా ఆ రైలు ప్రయాణాన్ని లేకుండా చేయాలని చూస్తున్న ఆ కోటలోని మాయ గాళ్ళ నుండి ఈ ప్రయాణికురాలు ఒడ్డున పడుతుందా లేదా అన్నది కొంత కాలం వేచిచూద్దాం..వచ్చే ఎపిసోడ్ లో మరిన్ని విషయాలతో ...

కోట కథ స్టోరీ

# అసెంబ్లీ నేటికి వాయిదా

ప్రజాభూమిప్రతినిధి,అమరావతి:-

బడ్జెట్ సమావేశాలు నేటికి వాయిదా పడ్డాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. వైసీపీ సభ్యుల నిరసనల మధ్యే గవర్నర్ ప్రసంగం కొనసాగింది. కాసేపు నిరసన కార్యక్రమాన్ని చేపట్టిన వైసీపీ సభ్యులు ఆ తర్వాత సభ నుంచి వాకౌట్ చేశారు. వైసీపీ వాకౌట్ తర్వాత గవర్నర్ ప్రసంగం కొనసాగింది. ప్రసంగం ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు, అసెంబ్లీ స్పీకర్, శాసనమండలి ఛైర్మన్ గవర్నర్ ను వాహనం వరకు తీసుకెళ్లి వీడ్కోలు పలికారు. అనంతరం సభను నేటికి వాయిదా వేశారు. సభ వాయిదా పడిన వెంటనే బీఏసీ సమావేశం ప్రారంభమయింది. ఈ సమావేశంలో అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై అజెండాను నిర్ణయించనున్నారు.

**గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం హైలైట్స్**



ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్ర గవర్నర్
పోలవరం, అమరావతిని పట్టాలెక్కించామని వెల్లడి
విద్య, వైద్యం, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టామని వెల్లడి
రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ రూ. 16 లక్షల కోట్లకు విస్తరించిందని వ్యాఖ్య
బీసీల ఉన్నతి కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టామన్న గవర్నర్

బడ్జెట్ సమావేశాలు ఈ ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. ఎన్నికల్లో తమ ప్రభుత్వానికి ప్రజలు తిరుగులేని మెఃజార్టీ ఇచ్చారని తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో ఎంతో నష్టపోయామని అన్నారు. సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేస్తున్నాం.మా ప్రభుత్వం వచ్చిన తర్వాత తలసరి ఆదాయం పెరిగింది. ప్రతి నెల ఒకటో తేదీనే ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందిస్తున్నాం.పెన్షన్లను రూ. 4 వేలకు పెంచాం.విద్య, వైద్యం, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. అన్న క్యాంటీన్లు తెచ్చి పేదవాళ్ల ఆకలి తీరుస్తున్నాం.2047 నాటికి స్వర్ణాంధ్ర కలను సాకారం చేస్తాం.పోలవరం, అమరావతిని పట్టాలెక్కించాం.ఇప్పటి వరకు ఇన్వెస్టర్లు రూ. 6.5 లక్షల పెట్టుబడులు పెట్టారు.రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ రూ. 16 లక్షల కోట్లకు విస్తరించింది.పరిశ్రమలు, పరిపాలన, ఆర్థిక వృద్ధిలో ఏఐని వినియోగిస్తున్నాం.పీపుల్స్ ఫస్ట్ విధానంతో స్వర్ణాంధ్ర సాధనకు సమగ్ర రోడ్ మ్యాప్ సిద్ధం చేశాం.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాం.బీసీ వర్గాల ఉన్నతి కోసం ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాం. నామినేటెడ్ పోస్టులు, స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాం.వైజాగ్ స్టీల్ ప్రైవేటీకరణ ఆగిపోయింది.ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. మెరిట్ ఆధారంగా 9 యూనివర్సిటీలకు వీసీలను నియమించాం.2027 నాటికి పోలవరంను పూర్తి చేస్తాం.పోలవరం-బనకచర్ల పూర్తయితే రాయలసీమలో కరవు ఉండదు.ప్రతి ఇంటికి ఒక వ్యాపారవేత్త ఉండాలనేది మా లక్ష్యం.ఏపీని ఐటీలో టాప్ లో నిలిపేలా కొత్త ఐటీ పాలసీ తీసుకొచ్చాం.వైసీపీ నిలిపివేసిన 93 కేంద్ర పథకాల్లో 74 పథకాలను పునరుద్ధరించాం.ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం.వెలిగొండ ప్రాజెక్ట్ ను త్వరలోనే పూర్తిచేస్తాం.10 పోర్టులను అంతర్జాతీయ పోర్టులుగా అభివృద్ధి చేస్తున్నాం.2029 నాటికి విశాఖలో 46 కిలోమీటర్లు, విజయవాడలో 38.40 కిలోమీటర్ల మెట్రో రైల్ నిర్మాణం జరుగుతుంది. 20 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేశాం.

# ఐదేళ్లలో ప్రతిపక్ష హోదా రాదు

మొదటిపేజీ తరువాయి



గత కొద్ది రోజులుగా గవర్నర్‌కు ఆరోగ్యం బాగోలేకపోయినప్పటికీ... సభకు వచ్చి ప్రసంగించినందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్టుగా పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగం సమయంలో వైసీపీ సీనియర్ నాయకులు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని నినాదాలు చేయడంతో పాటు, పేపర్లను సైతం చించివేశారని చెప్పారు. ప్రతిపక్ష హోదా అడిగితే వచ్చేది కాదని.. అది ప్రజలు ఇస్తేనే వస్తుందని అన్నారు.

''జనరల్‌గా అత్యధిక మెజారిటీ ఉన్నవారు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారు.నెక్స్ట్ స్టేజ్‌లో ఉన్నవారికి ప్రతిపక్ష హోదా ఇస్తారు. గతంలో మేము ప్రభుత్వంలో ఉన్నాం కదా... ప్రతిపక్ష హోదా కావాలని అడిగితే ఇవ్వరు. కనీసం జనసేన కంటే ఒక్క సీటు ఎక్కువ వచ్చినా వారికి ప్రతిపక్ష హోదా దక్కేది. ఈరోజు ప్రభుత్వంలో రెండో అతిపెద్ద పార్టీ జనసేన. వైసీపీ నాయకులు ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తాం, ప్రసంగాలను అడ్డుకుంటామని అనడం సరైన విధానం కాదు'' అని వైసీపీపై విమర్శలు చేశారు.

వైసీపీకి ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని... 11 సీట్లు ఇచ్చారని, దానిని గౌరవించి వారు అసెంబ్లీకి రావాలని సూచించారు. నిబంధనల ప్రకారం వారు మాట్లాడేందుకు ఇవ్వాల్సిన సమయం ఇస్తారని అన్నారు. వైసీపీ హుందాగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. గొడవ పెట్టుకోవాలనే ఆలోచనతో అసెంబ్లీకి రావడం దిగజారుడు ఆలోచన విధానమమని పవన్ కల్యాణ్ విమర్శించారు. ఈ ఐదేళ్లలో వైసీపీకి ప్రతిపక్ష రాదని... ఇందుకు వారు మానసిక సిద్ధమైపోవాలని అన్నారు. ఇది సీఎం చంద్రబాబు నాయుడు, జనసేన డిసైడ్ చేసేది కాదని... రూల్స్ ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

''కేంద్ర ప్రభుత్వ ఏర్పాటుకు వెళ్లినప్పుడు... ఎన్డీయే పక్ష నేతను ఎన్నుకునే సమయంలో నేను నాయకుల స్థాయిలో కూర్చొన్నాను. ఏపీలో మంత్రివర్గ ప్రమాణ స్వీకార సమయంలో... ప్రధాని మోదీ పక్కన నేను కూర్చొలేదు. నేను డిప్యూటీ సీఎం అయినప్పటికీ... మంత్రి హోదానే కాబట్టి మంత్రుల పక్కనే నన్ను కూర్చొబెట్టారు. ప్రభుత్వం కొన్ని ప్రత్యేకమైన రూల్స్‌తో నడుస్తుంది.

ఈరోజు ఉదయం కూడా స్పీకర్ ఎదురొచ్చి... గవర్నర్‌కు స్వాగతం పలికేందుకు ఆయనతో పాటు రావాల్సిందిగా చెప్పారు. అయితే ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం స్వాగతం పలికేందుకు అవకాశం ఉండదు. ఎందుకంటే కేవలం ముఖ్యమంత్రి, స్పీకర్, కౌన్సిల్ చైర్మన్ చేసే ప్రక్రియలో ఉప ముఖ్యమంత్రికి ప్రోటోకాల్ ఉండదు. మేము రూల్స్ అర్థం చేసుకుని వాటికి అనుగుణంగా పని చేస్తున్నాం. మాకు లేని ప్రోటోకాల్ మేము అడగలేదు.

ప్రతిపక్ష హోదా అనేది వైసీపీకి ప్రజలు ఇవ్వలేదు... ఇది మేము వారిని ఏదో చేయాలని చేసేది కాదు. అది వైసీపీ నాయకులు దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలి. ఓట్ల శాతం ప్రకారం హోదా ఇచ్చే అధికారం మన భారత రాజ్యాంగంలో లేదు... అలా కావాలని వైసీపీ జర్మనీ రాజ్యాంగంలో అలాంటి అవకాశం ఉంది. అక్కడకు వెళ్లి ప్రతిపక్ష హోదా తెచ్చుకుంటే మాకు ఏ అభ్యంతరం లేదు'' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

## - పోలింగ్ స్టేషన్లలో ఏర్పాట్లను తనిఖీ చేసిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ




ప్రజాస్వామ్య స్ఫూర్తితో ప్రశాంత వాతావరణం లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఈ నెల 27న కృష్ణా-గుంటూరు జిల్లాల శాసన మండలి పట్టభద్రుల నియోజక వర్గం ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా కలెక్టర్ లక్ష్మీశ సోమవారం నగరంలోని పటమట బాలుర ఉన్నత పాఠశాల, లయోలా కళశాలలోని వివిధ పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాల కల్పన విషయంలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని అధికారులకు స్పష్టం చేశారు. ప్రలోభాలకు తావులేని, స్వేచ్ఛాయుత, శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయడం జరుగుతోందని.. ఇందులో భాగంగా వివిధ పోలింగ్ స్టేషన్లను సందర్శించి.. చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్నట్లు వెల్లడించారు. భద్రతా చర్యలు, వెబ్‌క్యాస్టింగ్ తదితరాలపైనా మార్గనిర్దేశనం చేసినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. జిల్లాలో మొత్తం 112 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని.. ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఒకరు చొప్పున మొత్తం 112 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించి శిక్షణ కూడా ఇచ్చినట్లు తెలిపారు. అన్ని పోలింగ్ స్టేషన్లలోనూ వెబ్‌క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. తనిఖీల్లో కలెక్టర్ వెంట విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య తదితరులు ఉన్నారు.

# సూర్యప్రభవాహనంపై ఊరేగిన శ్రీ కల్యాణ వెంకన్న..

ప్రజాభూమి, చంద్రగిరి:



శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన సోమవారం ఉదయం 8 గంటలకు శ్రీనివాసుడు సూర్యప్రభ వాహనంపై శ్రీ మన్నారాయణుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ మూర్తిని వాహన మండపమునకు తీసుకువచ్చి శ్రీమన్నారాయణుడిఅలంకరణ గావించి సూర్యప్రభ వాహనంపైఅధిష్టింపజేసినాలుగు మాడ వీధులలోగజరాజులునడుస్తుండగా, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

**ఆయురారోగ్యప్రాప్తి :**సూర్యుడు సకలరోగ నివారకుడు,ఆరోగ్యకారకుడు, ప్రకృతికి చైతన్య ప్రదాత. ఔషధీపతి అయిన చంద్రుడు కూడా సూర్యతేజం వల్లనే ప్రకాశిస్తూ వృద్ధి పొందుతున్నాడు. ఈ వాహనంలో శ్రీవారి చుట్టూ ఉన్న సూర్యప్రభ సకల జీవుల చైతన్య ప్రభ. సూర్యమండల మధ్యవర్తి శ్రీమన్నారాయణుడే. అందుకే సూర్యుని సూర్యనారాయణుడు అని కొలుస్తున్నాం. ఇంతటి మహాతేజఃపూర్ణమైన సూర్యప్రభ వాహనంలో ఉండే సూర్యనారాయణుడిని దర్శిస్తే ఇతోధిక భోగభాగ్యాలు, సత్సంతాన సంపదలు,ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయిఅని భక్తుల విశ్వాసం.ఇందులో భాగంగా రాత్రిచంద్రప్రభ వాహనము పైభక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారని అధికారులు తెలిపారు. ఈవాహన సేవలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, వైఖానస ఆగమ సలహాదారులు మోహన రంగాచార్యులు, సూపరింటెండెంట్ రమేష్, ఆలయ అర్చకులు బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధన శేఖర్, ఇతర అధికారులు, విశేష సంఖ్యలోభక్తులుపాల్గొన్నారు.

**ఫిబ్రవరి 25న రథోత్సవం** శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారిబ్రహ్మోత్సవాల్లో 8వ రోజైన మంగళవారం రథోత్సవం వైభవంగా జరుగనుంది. ఉదయం 5 గంటలకు స్వామివారు రథారోహణం చేస్తారు. ఉదయం 8.40 గంటలకు రథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి 7 నుండి 8 గంటల వరకు అశ్వవాహనంపై స్వామివారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు.

# ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో బాకరాపేట తలకోన నూతన బస్సు సర్వీస్ ప్రారంభం..!





ప్రజాభూమి,చంద్రగిరి:

యర్రావారిపాలెం మండలం నెరబైలు పంచాయతీ ప్రముఖపర్యాటక పుణ్యక్షేత్రం తలకోన కు ఎమ్మెల్యే చొరవతో భాకరాపేట నుంచి తలకోనకు బస్సు సర్వీసును ఆర్ టి సి అధికారులు ప్రారంభించారు. తలకోన బ్రహ్మోత్సవాల సమీక్షా సమావేసానికి వచ్చిన ఎమ్మెల్యే పులివర్తి నానికి నెరబైలు గ్రామప్రజలు, తలకోన బోర్డు చైర్మన్ సోమునాద రెడ్డి విన్నవించడం జరిగింది. వారి విజ్ఞప్తి మేరకు అధికారులతో మాట్లాడి ఉదయం నుంచి సాయంత్రం వరకు తలకోన బస్ తిరిగేవిదంగా బస్ సర్వీస్ ను ప్రారంభించడం జరిగింది. నూతన బస్ సర్వీస్ ను తలకోన దేవస్థాన బోర్డు చైర్మన్ సోమునాథ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో మండల పార్టీ అధ్యక్షులు దేశిరెడ్డి రఘునాథ రాయపాటి బాలకృష్ణ ,ప్రసాద్ మనోహర్ ,మల్లూరి దేవి రమణారెడ్డి, మద్దూరి శ్రీనివాసులు వెంకీ, రెడ్డి శేఖర్ రాము, వెంకట శివర్రాం రెడ్డి, శివకుమార్ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆదిత్య ఐటీ విభాగంలో అతిధి ఉపన్యాసం

ప్రజాభూమి గండేపల్లి .




ఆదిత్య యూనివర్సిటీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో డే వోప్స్ భవిష్యత్తు ధోరణులు,సవాళ్లు మరియు కెరీర్ రోడ్‌మాప్ అనే అంశం పై అతిధి ఉపన్యాసం నిర్వహించారు.ఈ కార్యక్రమనికి రిసోర్స్ పర్సన్ గా వై గీతిక, సీనియర్ క్లౌడ్ మరియు డే వోప్స్ ఇంజనీర్, డెలాయిట్ సంస్థ నుండి విచ్చేసారు. ఆమె డే వోప్స్ సంబంధిత కొత్త ధోరణులు, అప్‌డేట్లు,అలాగే ఈ రంగంలో ఎదురయ్యే సవాళ్ళను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు తమ కెరీర్ ను ముందుకు తీసుకెళ్లడానికి అవసరమైన నైపుణ్యాలు గురించి అవగాహన పొందారు.ముగింపు కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి శ్రీనివాస్, ఎస్ రమాశ్రీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలకు ఆటల పోటీలు నిర్వహించిన సిడిపిఓ పూర్ణిమ

ప్రజా భూమి జగ్గంపేట



మార్చి ఎనిమిదో తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో అంగన్వాడి కార్యకర్తలకు హెల్పర్స్ కు కబడ్డీ కోకో రన్నింగ్ ఆటలు పోటీలు నిర్వహించినారు అని ఐసిడిఎస్ సిడిపిఓ ఎం పూర్ణిమ అన్నారు వీరిలో 24 మందిని సెలెక్ట్ చేసి కాకినాడ జేఎన్టీయూ లో జిల్లాస్థాయిలో నిర్వహించు ఆటల పోటీలో పాల్గొంటున్నారు ఆటల పోటీల అడ్డం వల్ల మానసిక ఉల్లాసానిస్తుందని ప్రతి ఒక్కరు రోజుకి గంట ఆటల్లో పాల్గొనాలని అన్నారు.

# ఒక్క రూపాయి అదనంగా వసూలు చేసినా సహించేది లేదు

**- ఫిర్యాదులు రుజువైతే ఏజెన్సీ లైసెన్సుల రద్దుకూ వెనుకాడం**
**- దీపం-2 అమలు ప్రగతికి లబ్ధిదారుల సంతృప్తే గీటురాయి**
**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:



దీపం-2 పథకం ద్వారా అందించే ఉచిత గ్యాస్ సిలిండర్లకు లబ్ధిదారుల నుంచి అదనంగా ఒక్క రూపాయి వసూలు చేసినా సహించేది లేదని, ఫిర్యాదులు రుజువైతే సంబంధిత గ్యాస్ ఏజెన్సీల లైసెన్సులు రద్దుచేస్తామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హెచ్చరించారు. జిల్లాలో దీపం-2 పథకం అమలు, ఐవీఆర్ఎస్ సర్వే నివేదికలు, ఫిర్యాదులపై చర్యలు తదితరాలపై చర్చించేందుకు కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్‌లో సమావేశం జరిగింది. పౌర సరఫరాలు, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులతో పాటు వివిధ ఎల్‌పీజీ డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దీపం-2 పథకాన్ని అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో అమలుచేసే విషయంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించిందని, పథకం అమలు ప్రగతికి లబ్ధిదారుల సంతృప్తే గీటురాయని, దీపం పథకం కింద ఉచితంగా పొందుతున్న సిలిండర్లకు లబ్ధిదారులు తాము చెల్లించిన నగదు 48 గంటల్లో తమ ఖాతాల్లో జమవుతోందన్నారు. ఇప్పటివరకు పథకం ద్వారా 4,05,611 మంది ఖాతాల్లో దాదాపు రూ. 32.19 కోట్లు జమయిందన్నారు. అయితే ఉచిత గ్యాస్ పథకం కింద ముందు చెల్లించే అసలు బిల్లుకు అదనంగా డెలివరీ బాయ్స్ కొంత మొత్తాన్ని వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని.. ఇలాంటి ఫిర్యాదలకు సంబంధిత గ్యాస్ ఏజెన్సీ డీలర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఐవీఆర్ఎస్ సర్వే ఆధారంగా మొదటి విడతలో తొమ్మిది మంది ఎల్‌పీజీ డీలర్లకు, రెండోవిడతలో అయిదు మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న 52 ఏజెన్సీలు నిబద్ధతతో సేవలందించాలని, ఏవైనా అవకతవకలకు పాల్పడితే ఏపీ పెట్రోలియం ప్రొడక్ట్స్ యాక్ట్, ఎంఆర్‌పీ యాక్ట్ తదితరాల ద్వారా చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్యాస్ వినియోగదారులు.. రశీదులో ముద్రించియున్న ధరకంటే అదనంగా ఒక్క రూపాయికూడా చెల్లించనవసరం లేదని, అదేవిధంగా వినియోగదారుడు గ్యాస్ సిలిండర్ తీసుకునే సమయంలో తూకంలో తేడా ఉన్నట్లు అనుమానం ఉంటే సదరు డెలివరీ బాయ్స్ ద్వారా తూకాన్ని సరిచూసుకోవచ్చన్నారు. పౌర సరఫరాలు, తూనికలు-కొలతల అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలను ముమ్మరం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.సమావేశంలో డీఎస్‌వో ఎ.పాపారావు, జిల్లా లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ కృష్ణచైతన్యతో పాటు ఎల్‌పీజీ డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి పురాతన విగ్రహం ప్రతిష్ట



సాక్షాత్తు శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి స్నానం ఆచరించి నామాలు ధరించిన నామాల కాలువ గట్టు పైన ఇటీవల లభించిన అతి పురాతన విగ్రహాన్ని సోమవారం మధ్యాహ్నం శుభ సమయంలో నడవలూరు కృష్ణమూర్తి స్వామి పునః ప్రతిష్టించారు. ఈ ప్రతిష్ట కార్యక్రమంలో అనేకమంది భక్తులు నామాల కాలవలో స్నానం ఆచరించి నామాలు ధరించిన అనంతరం గోవింద నామాల పలుకుతూ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి స్వామి మాట్లాడుతూ సాక్షాత్తు కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారు నారాయణవనంలో పద్మావతి అమ్మవారిని పరిణయం ఆడి తిరుమలకు వెళ్ళచ్చు ఈ యొక్క యోగుల కొండపై ఉన్న సిద్ధపరుచులు యోగుల తపసకు మిర్చి వారికే అభయమిచ్చిన అనంతరం యొక్క కాలువలో స్నానం ఆచరించి నామాలు ధరించారన్నారు. స్వామివారు నామాలు ధరించిన కారణంగా ఈ యొక్క కాలువకు నామాల కాలువగా పేరుగాంచిన స్వామివారు నామాలు ధరించిన అనంతరం ఒక చిన్న విగ్రహాన్ని ఏర్పాటు చేశారని రాజుల కాలంలో ఈ యొక్క స్వామి వారిపై దాడి జరిగినప్పుడు ఈ యొక్క స్వామివారిని ధ్వంసం చేశారన్నారు. అనంతరం పాదాలపై భాగం గత 20 సంవత్సరాలకు మునుపు ఇదే కాలువ పక్కన బయటపడగా ఆ యొక్క విగ్రహాన్ని నడవలూరులో గ్రామంలో ఉన్న మారేడు చెట్టు కింద ఉంచామన్నారు. ఈ సంవత్సరంలో జరిగిన రథసప్తమికి ముందు మూడు రోజులకు ముందు ఓ రైతు ఈ కాలువ గత పైన ట్రాక్టర్ తో దున్నుతున్నంగా ఈ యొక్క పాదాలు బయటపడ్డాయి అనంతరం ఈ పాదాలను పై భాగాన ఉన్న స్వామి వారికి జత చేయడంతో రెండు సరిపోయాయన్నారు. స్వామివారు ఎక్కడ దొరికారు అక్కడే ప్రతించాలని పలువురు సూచనల మేరకు ఈరోజు 12:00 పైన శుభలగ్నం యందు భక్తి శ్రద్ధలతో స్వామి వారి విగ్రహ ప్రతిష్ట జరిగిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవ చూపి టిటిడి వారు నామాల కాలవను అధీనంలో ఒక తీసుకొని ఇక్కడ ఆలయమున నిర్మించాలని కోరారు.

# పులివెందుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అడ్డు

**పులివెందుల ఒకటే. కాదని కుప్పం, పిఠాపురం, మంగళగిరిలో కూడా ఎన్నికలకు వెళదామని అందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమా**

ప్రజాభూమి, పులివెందుల




పులివెందుల అభివృద్ధి ని కూటమి ప్రభుత్వం కావాలనే అడ్డుకుంటుందని కడప ఎంపీ అవినాష్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడే 9 నెలలు గడుస్తున్నా అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసినా గొంగళి అక్కడే ...అన్న చందంగా తయారయ్యిందన్నారు. పులివెందుల్లో రింగ్ రోడ్డు , మెడికల్ కాలేజీ ,సిసి రోడ్లు, పార్కులు రాణి తోపు యు జి డి పనులు సిల్క్ ట్రైనింగ్ అకాడమీ ఇంటిగ్రేటెడ్ కోల్డ్ స్టోరేజ్ వంటి వాటివి వైయస్ . జగన్ ప్రభుత్వం లో తీసుకొచ్చి అభివృద్ధి చేసేందు కు తాము కృషి చేస్తే తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటన్నింటినీ పక్కన పెట్టిందన్నారు. రూ. 300 కోట్లతో మెడికల్ కాలేజ్ నీ నిర్మించామని కేంద్ర ప్రభుత్వంలో నేషనల్ మెడికల్ కౌన్సిలర్ 50 సీట్లు కూడా మంజూరు. చేసిందన్నారు. కానీ మంజూరైన సీట్లను కూడా కూటమి ప్రభుత్వం రద్దుచేసి వెనక్కి పంపించిందని మండిపడ్డారు.అరటి రైతుల కోసం రూ 30 కోట్లతో కోల్డ్ స్టోరేజ్ కట్టించిన దాని వినియోగంలోకి తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంద ని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో 90 శాతం పనులు పూర్తయ్యాయని 10% పనులు పూర్తి చేస్తే వైసిపి కి మంచి పేరు వస్తుందన్న కారణంతోనే కూటమి ప్రభుత్వం వెనకడుగు వేస్తుందన్నారు .గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారులను బదిలీ చేసి కక్ష సాధింపు చర్యలు పాల్గొనడం తప్పితే ప్రజల కోసం పనిచేయడం లేదు. కూటమి ప్రభుత్వం పై ప్రజల విసిగిపోయి ఉన్నారు. సమయం వచ్చిన పుడు దిమ్మతిరిగే సమాధానం చెబుతారని వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. పులివెందులలో ఉప ఎన్నిక మాట్లాడే కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు రేపే రెండం తో ఎన్నికలు వెళ్లే దమ్ముందా అనికడప. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రశ్నించా రు.పులివెందులలో గత ఎన్నికల్లో బీటెక్ రవి 65. వేల ఓట్లతో గెలుపొందడం గుర్తు చేశారు. పులివెందుల ఒకటే. కాదని కుప్పం, పిఠాపురం, మంగళగిరి .లో కూడా ఎన్నికలకు వెళదామని అందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమా ...అని ఎంపీ ప్రశ్నించారు .కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన సూపర్ సిక్స్ పథకాలు రెఫరెడం తో తాము ఎన్నికలకు సిద్ధమని అన్నారు. కాకమ్మ కబుర్లు చెప్పడం మినహా కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసేది. ఏమీ లేదన్నారు. వైయస్ జగన్ కు అసెంబ్లీలో ప్రతిపక్షం హొదా కల్పిస్తే అభివృద్ధి పై ప్రశ్నిస్తారనే ఒకే ఒక్క కారణంతో కూటమి ప్రభుత్వం మోకాలడ్డుతుందన్నారు.

# వైకాపా పార్టీ కోసం కష్టపడి పని చేయాలి

**సారెడ్డి ని సన్మానించిన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి**

ప్రజాభూమి, పులివెందుల



వైకాపా పార్టీ కోసం కష్టపడి పని చేయాలని పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి రైతు విభాగం అధ్యక్షుడిగా పదవి బాధ్యతలు అందుకు న్న సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి సూచించారు. ఆదివా రం పట్టణంలోని ఎస్సీ ఎస్ ఆర్ గార్డెన్ లో వైఎస్ భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలను సారెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రైతు విభాగపు అధ్యక్షు డిగా పదవీ బాధ్యతలు అందుకున్న చంద్రశేఖర్ రెడ్డిని అభినందించి దుశాలవాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వైఎస్ భాస్కర్ రెడ్డి జన్మదిన కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని అలాగే లింగాల మండల నాయకులతో కలిసి పార్టీ అభివృద్ధికి పాటుపడాలని ఎంపీ సూచించారు. అనంతరం చంద్రశేఖర్ రెడ్డి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని పూలమాల దుశ్శాలవాతో ఘనంగా సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల వైకాపా కన్వీనర్ బాబు రెడ్డి, కేతిరెడ్డి ప్రసాద్ రెడ్డి. లింగాల మండల వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 11స్థానాలు పరిమితమైనా జగన్ తీరులో మార్పు రాలేదు

**అనర్హత నుంచి తప్పించుకునేందుకు జగన్ అసెంబ్లీకి వచ్చారు**

**అసెంబ్లీలో వైసిపి ఎమ్మెల్యేల తీరుపై అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం**

ప్రజాభూమి, అనంతపురము



అధికారంలో ఉన్నప్పుడు అంహకారంతోనూ, స్వార్థ పూరితంగానూ పాలన సాగించిన జగన్ రెడ్డిని 11 స్థానాలకే ప్రజలు పరిమితం చేశారని, అయినా ఆయన తీరులో మార్పు రాలేదని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శలు చేశారు. వైసీపీకి చెందిన ఎమ్మెల్యేలు అసెంబ్లీని బాయ్ కాట్ చేసిన అంశంపై ఆయన తీవ్రంగా స్పందించారు. జగన్ ను నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు ఆయన ఏం చేస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. మంచి చేస్తున్న తెలుగుదేశం ప్రభుత్వంపై నిత్యం విమర్శలు చేస్తూ, ఏదో ఒక అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు ప్రజలన్నా, ప్రజాస్వామ్యం అన్నా, ఎన్నికల కమిషన్ నిబంధనలన్నా లెక్కలేదని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజలు వైసిపికి ప్రతిపక్ష హొదా లేకుండా చేసినా కూడా ఆయనకు బుద్ధి రాలేదన్నారు. ప్రతిపక్ష హొదా ఇవ్వాలని గవర్నర్ ప్రసంగానికి అడ్డు తగలడం ఏంటని నిలదీశారు. అసెంబ్లీలో వైసీపీ ఎమ్మెల్యేల వ్యవహారశైలి వారి దిగుజారుడుతనానికి నిదర్శనంగా కనిపించిందన్నారు. ఎవరైనా అసెంబ్లీలో ప్రజా సమస్యలపై పోరాడటం చూస్తుంటాం కానీ.. ప్రతిపక్ష హొదా కోసం పోరాడే వారిని ఇప్పుడే చూశామన్నారు. జగన్ సహా వైసీపీ ఎమ్మెల్యేలకు ప్రజా సమస్యలపై బాధ్యత లేదన్నారు. ప్రజా సమస్యల కన్నా జగన్‌కు అసెంబ్లీలో ప్రతిపక్ష హొదానే ముఖ్యమా? ప్రతిపక్ష హొదా ఒకరిస్తే వస్తుందా? అంటూ నిలదీశారు. సభ్యత్వాలు రద్దవుతాయని హాజరు కోసం అసెంబ్లీకి వచ్చినట్టు ఉందని ఎద్దేవా చేశారు. వారికి ఎమ్మెల్యేలుగా ఉండటం ఇష్టం లేకపోతే రాజీనామా చేయాలని హితవు పలికారు. ప్రజల పట్ల వారికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా అసెంబ్లీలో ఉండేవారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వ్యాఖ్యానించారు.

# ఎమ్మెల్సీఎలక్షన్ క్యాంపెనింగ్ లో జగంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్

ప్రజా భూమి జగ్గంపేట

ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీఎన్నికలలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల మన కూటమి అభ్యర్థి అయిన శ్రీ పేరాబత్తుల రాజశేఖరం గారి గెలుపు కోసం జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ కిర్లంపూడి మండలం లో ప్రచారం నిర్వహించారు. కిర్లంపూడి మండలంలో ఉన్న గ్రామలలో ఉండేటువంటి గ్రాడ్యుయేట్ ఓటర్లను ప్రతీ ఒక్కరినీ పేరు పేరునా కలిసి మన అభ్యర్థి శ్రీ పేరాబత్తుల రాజశేఖరం గారికి “ 1 “ ఒకటవ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి కోరారు.ప్రచారంలో భాగంగా కిర్లంపూడి మండలం లో ఉన్న కిర్లంపూడి,జగపతినగరం,చిల్లంగిగ్రామలలో ఎలక్షన్ క్యాపెనింగ్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జనసేన ప్రోగ్రామింగ్ కమిటీ నెంబర్ దేగల విజయకుమార్ కిర్లంపూడి జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు గంధం ప్రభాకర్, కిర్లంపూడి మండల జనసేన పార్టీ అధికార ప్రతినిధి పాతిరెడ్డి శేఖర్, పాటంశెట్టి రమేష్, బోండ నందిబాబు, నాగబోయిన శివ, చిక్కాల భగవాన్, పుర్రె శ్రీనివాస్, నాసిన రాజకుమార్, రేవూరి శ్రీను, ఎలుగంటి నల్లబాబు జనసేన సైనకులు పాల్గొన్నారు.



## పేరాబత్తుల విజయానికి ప్రతి గ్రాడ్యుయేట్ సహకరించాలి.

### రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు.

ప్రజాభూమి,బుట్టాయగూడెం



ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ సహకరించాలని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు కోరారు. బుట్టాయగూడెంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో 66 మంది బూత్ ఇన్చార్జిలు, మండల అధ్యక్షులు, తదితరులతో ఎమ్మెల్సీ ఎన్నికల కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తమ పరిధిలోని ప్రతి గ్రాడ్యుయేట్ ను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు ఒకటో నెంబర్ పై వేసి, పేరా బత్తుల విజయానికి సహకరించేటట్లు కృషి చేయవలసిందిగా చెప్పారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ పరిశీలకుడు పుచ్చ విజయకుమార్ పోలవరం నియోజకవర్గంలో సుమారు గ్రాడ్యుయేట్ 5514 ఓట్లు ఉన్నాయని, ప్రతి గ్రాడ్యుయేట్ కూటమి తరపున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బూత్ ఇన్చార్జులు, ఎన్నికల కోసం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలు ఓటు వేసే విధానంపై వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు అనపర్తి వెంకటనారాయణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు, బిజెపి నియోజకవర్గం కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ, జిల్లా ఎస్ టి మోర్చా అధ్యక్షురాలు వంకా కాంచనమాల, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మొగపర్తి సోంబాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మెట్టా బుచ్చిరాజు, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా నిర్మించిన పొగాకు బ్యారన్ లపై చర్యలకు సిఫార్సు

### జంగారెడ్డిగూడెం పొగాకు బోర్డ్ ఆక్షన్ సూపరింటెండెంట్ బి.శ్రీహరి

ప్రజాభూమి, బుట్టాయగూడెం.



పశ్చిమ ఏజెన్సీలో వర్జీనియా పొగాకు క్యూరింగ్ కోసం అనుమతులు లేకుండా నిర్మించిన పొగాకు బేరాలపై చర్యలకు పొగాకు బోర్డు కేంద్ర కార్యాలయానికి సిఫారసు చేసినట్లు జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం యాక్షన్ సూపరిండెంటెంట్ బి.శ్రీహరి తెలిపారు. బుట్టాయగూడెం లో వివిధ పొగాకు బ్యారన్ లలో జరుగుతున్న వర్ధిని పొగాకు క్యూరింగ్ పనులను సోమవారం పొగాకు బోర్డ్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వేలం అధికారి శ్రీహరి మాట్లాడుతూ గత ఏడాది 5150హెక్టార్లలో వర్జిన్య పొగాకును పండించగా, ఈ ఏడాది 6250 హెక్టార్లలో పండిస్తున్నట్లు చెప్పారు. ఏడాది పొగాకు పంటకు వాతావరణం అనుకూలించిందని, రైతులు నాణ్యమైన, అధిక దిగుబడులను సాధించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు పొగాకు గ్రేడింగ్ కు బోర్డు అధికారులు సూచించిన మేలైన పద్ధతులను పాటించాలని, ఒకసారి కొట్టిన పొగాకును, మరోసారి కొట్టిన పొగాకుతో కలపకుండా, విడివిడిగా బేలుగా తొక్కాలని చెప్పారు. పొగాకులో ప్లాస్టిక్, కాగితం ముక్కలు, ఇతర వ్యర్థాలు లేకుండా తీసుకోవాలని అన్నారు. పొగాకుల పురుగు మందుల అవశేషాలు లేకుండా తెలిపారు. ఈనెల 25వ తేదీన గుంటూరులో సమావేశం జరగనుందని, ఈ సమావేశానికి ఒక్కొక్క ప్లాట్ ఫారం నుండి ఇద్దరు రైతులు,, ఒక సూపరిండెంట్ హాజరవుతారని, ఆ సమావేశంలో పొగాకు కొనుగోళ్ల తేదీలను కూడా నిర్ణయించవచ్చని వివరించారు. ఈ రీజియన్ లో ఒకచోట పాడైపోయిన బేరను మరోచోట నిర్మించుకోవడానికి అవకాశం ఉందని, కొత్త బ్యారన్స్ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు స్పష్టం చేశారు. ఈయన వెంట సీనియర్ గ్రేడింగ్ అధికారి కె.సుధీర్ ఉన్నారు.

## భారీ పరిశ్రమ శాఖ మంత్రి వర్మను కలిసిన మండల బిజెపి నాయకులు!

### ఏజెన్సీ ప్రాంతాన్ని దృష్టిలో పెట్టుకో ని అభివృద్ధి అవకాశాల కోసం వేడుకోలు!

### ఏజెన్సీ ప్రాంతంలో పరిశ్రమలకు అవకాశం కల్పించండి!


ప్రజాభూమి, జీలుగుమిల్లి



తెలంగాణ ఆంధ్ర ప్రాంత ఏజెన్సీ ప్రాంతంలో పరిశ్రమలకు అవకాశం ఉంటే కల్పించండి అంటూ బిజెపి మండల కార్యవర్గం కేంద్ర భారీ పరిశ్రమలు, బొగ్గు సహాయం మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం లో ఆ నివాసంలో కలిశారు. ఏజెన్సీ ప్రాంతంలో రోడ్లు ఇప్పటికే ప్రారంభమయ్యాయని అనువైన ప్రాంతాలలో పరిశ్రమలకు అవకాశం కల్పించాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పార్టీని బలోపేతం చేయడం కోసం మీ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. దీంతో కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. మర్యాదపూర్వకంగా మండల అధ్యక్షులు గుడ్ల రాంబాబు ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి చాట్రాతి ప్రసాద్ సమక్షంలో కలవటం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పులగం వెంకట సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు బుగ్గల శివరామకృష్ణ పాల్గొన్నారు.

## పెండ్లి కుమార్తెను ఆశీర్వదించిన కంభం విజయరాజు


ప్రజాభూమి, కామవరపుకోట



ప్రైవేటు కార్యక్రమంలో భాగంగా పెండ్లి కుమార్తెను చింతలపూడి వైఎస్ఆర్సిపి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు దీవించారు. ఈరోజు కామవరపు కోట మండలం కొత్తూరు గ్రామంలో రిటైర్ టీచర్ కంభం రత్నానంద కుమార్ సుశీలమ్మ కుమార్తె వివాహమునకు హాజరైన చింతలపూడి నియోజకవర్గం ఇంచార్జ్ కంభం విజయ రాజు నూతన వధువుని ఆశీర్వదించెను వారితోపాటు ఏలూరు జిల్లా గ్రీవెన్స్ సెల్ డాక్టర్ రామకృష్ణ , ఏలూరు జిల్లా యువజన విభాగా ప్రధాన కార్యదర్శి దాసి సుందర్ పాల్ (పండు ) ,చింతలపూడి నియోజకవర్గం ప్రచార కమిటీ చైర్మన్ మేరుగు బాబురావు , కామవరపుకోట టౌన్ ప్రెసిడెంట్ నానాది సాగర్ , సాక వెంకటరత్నం మేడంకి బుజ్జి, సిహెచ్ ఏసుపాదం , మాస్టర్ , పాల్గొన్నారు.

## శివరాత్రికి ముస్తాబైన శివాలయం

ప్రజాభూమి, వి.ఆర్.పురం.



మండలంలోని శబరి గోదావరి జీవనదుల సంఘం తీరం వద్ద వడ్డిగూడెం గ్రామం వద్ద వెలసీయున్న శ్రీ సతీ పార్వతి రుద్ర కోటేశ్వర స్వామి ఆలయంనీ శివపార్వతుల కళ్యాణానికి ముస్తాబు చేశారు. శివరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయానికి రంగులు అద్ది, విద్యుత్ దీపాలంకరణలు చేసి, భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటు చేసి ఆలయం చుట్టూ ప్రక్కల ఉన్న తుప్పలను తొలగించి సిద్ధం చేసారు. వడ్డీగూడెం పంచాయితీ వారు శివరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకొని, విఆర్ పురం నుంచి వడ్డీగూడెం శివాలయం వరకూ రోడ్డుకు ఇరుపక్కలా వున్న ముళ్ళ పొదలను తొలగించి, శానిటేషన్ పనులను చేసి, బ్లీచింగ్ పౌడర్ ను చల్లించి భక్తులకు అసౌకర్యం కలగకుండా పనులను పూర్తి చేశారు.

## సత్యదేవుని దర్శనంలో భక్తులకు ఆధ్యాత్మిక భావనకు అధిక ప్రాధాన్యత..

### -సామాన్య భక్తులకు సౌకర్యాలు కల్పనకు చర్యలు..

### - జిల్లా కలెక్టర్ షణ్మోహన్

ప్రజా భూమి ప్రతినిధి అన్నవరం





సత్యదేవుని దర్శనంలో భక్తులకు ఆధ్యాత్మిక భావన పొందేల చేయడంతో పాటు సామాన్య భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు.

సోమవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ శంఖవరం మండలం అన్నవరం సత్యనారాయణ స్వామిని ఆలయాన్ని దర్శించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో వి. సుబ్బారావు, వేద పండితులు జిల్లా కలెక్టర్ కు స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రధాన ఆలయం, యంత్రాలయంలోని స్వామివారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో భాగంగా అన్నవరం దేవస్థానం చివరి స్థానంలో ఉండడంతో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ దేవస్థానంలోని వివిధ భాగాలను చైర్మన్ ఐవీ. రోహిత్, ఈవో వి. సుబ్బారావు అధికారులతో కలిసి పరిశీలించారు. ఉచిత దర్శనం కోసం భక్తులు వేచి ఉన్న ప్రదేశం, ప్రసాదం పంపిణీ, వ్రతాలు ఆచరించే ప్రదేశం, భూతాది ప్రసాదం తయారీ, అన్నదానం వద్ద క్యూలైన్, వంటశాల, ఉచిత వసతి హాలు, పురుషుల మరుగుదొడ్లు, సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం, ఓల్డ్ సెంటినరీ కాటేజీ, న్యూ సెంటినరీ కాటేజీ తదితరాలను పరిశీలించి, జరుగుతున్న కార్యకలాపాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం వద్ద రూముల బుకింగ్ స్టేటస్ వివరాలు ఆరా తీశారు. వాస్తవ వివరాలకు రిపోర్టులోని వివరాలకు వ్యత్యాసం ఉండడంతో సిబ్బందిపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

దర్శనానికి ఎంత సమయం పట్టింది, దర్శనం బాగా జరిగిందా..క్యూలైన్ ఉందా, మరుగుదొడ్లు వినియోగించారా..ఎలా ఉన్నాయి, తాగునీరు, పారిశుధ్యం బాగుందా, రూములు ఎలా బుక్ చేసుకున్నారు, ప్రసాదం, భోజనం నాణ్యత, రుచి, శుభ్రత ఎలా ఉంది, వ్రతాలు ఆచరించడానికి, రూములు బుక్ చేసుకోవడానికి ఎవరికైనా అదనంగా డబ్బులు చెల్లిస్తున్నారా వంటి వివరాలను ఆయా ప్రదేశాల్లో ఉన్న భక్తులతో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మరుగుదొడ్లు కొన్నిచోట్ల సరిగా లేవని, ప్రసాదం పంపిణీ దగ్గర సిబ్బంది సరైన జాగ్రత్తలు తీసుకోవడం లేదని, డార్మెంటరీలు బాగున్నా సామాన్యులకు అవసరమైన తక్కువ ధరకు చెందిన రూములు ఎప్పుడు అడిగినా ఖాళీ లేవంటున్నారని, సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం వద్ద ఆన్ లైన్ పేమెంట్ చేసేందుకు అవకాశం లేదని, అన్నదానం చేసే పదార్థాలు బానే ఉన్నా ఎక్కువ సమయం క్యూ లైన్ లో వేచి ఉండవలసి వస్తుందని తదితర విషయాలను ఈ సందర్భంగా భక్తులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

అనంతరం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ రత్నగిరి ప్రకాశ్ సదన్ సత్రంలోని ట్రస్ట్ బోర్డు సమావేశ హాలులో వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రసిద్ధి చెందిన దేవాలయాల్లో అన్నవరంలోని వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. స్వామివారి దర్శనం నిమిత్తం దేవాలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక భావన కలిగేలా మెరుగైన వసతులు అందించేలా అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులు స్పష్టం చేశారు. ప్రాముఖ్యంగా దేవస్థానానిక సంబంధించిన నేమ్ బోర్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రసాదం కౌంటర్ల వద్ద కూడా సిబ్బంది తప్పనిసరిగా మాస్కు, గ్లౌజులు ధరించి విక్రయాలు చేయాలన్నారు. కొన్నిచోట్ల మరుగుదొడ్లు శుభ్రంగా లేవని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దేవస్థానంలోని 15 ప్రాంతాల్లోని మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తే ప్రతిరోజు సాయంత్రం ఫోటోలు పంపించాలని అధికారులను ఆదేశించారు. దేవస్థానం పరిధిలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా చూడాలన్నారు. బాలింతలు చిన్నారులకు పాలు పట్టించే ప్రదేశం వద్ద ప్రత్యేకంగా ఒక మహిళా సిబ్బందిని నియమించాలన్నారు. ప్రసాదం స్కీం కింద నూతన భవనాలు అందుబాటులో వచ్చేంతవరకు అన్నదానం కార్యక్రమం వద్ద క్యూలైన్లలో రద్దిని నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. తాగునీరు నమూనాలు సేకరించి ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించారన్నారు. సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం వద్ద భక్తులు ఇబ్బందులు పడకుండా రూములు బుకింగ్ చేసుకునేందుకు వీలుగా నెట్ సదుపాయం కల్పించాలన్నారు. సామాన్య భక్తులకు కూడా అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇకనుంచి ప్రతి నెల దేవస్థాన కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందని దేవస్థానానికి వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పన, తాగునీరు, మరుగుదొడ్లు, రవాణా, దర్శనం, అన్న ప్రసాదాలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిసారించి మరింత మెరుగుపరచవలసిన అవసరం ఉందన్నారు. ఆలయ దర్శనానికి వచ్చిన వివిధ ప్రాంతాల భక్తులు దేవస్థానంలో పొందిన సేవలపై ఆయా ప్రదేశాల్లో ఉన్న క్యూఆర్ కోడ్లను స్కాన్ చేసి తమ అభిప్రాయాలను వెల్లడించేలా అధికారులు భక్తులకు అవగాహన కల్పించాలన్నారు. దేవస్థానంలోని వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలో దేవస్థానం మెరుగైన స్థానం సాధించేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

సమావేశంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.రామ కృష్ణ, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి. శ్రీనివాసరావు, శంఖవరం ఎంపీడీవో ఎస్ఎస్.శర్మ, ఆర్డబ్ల్యూఎస్ డీఈ కె శ్రీదేవి, విద్యుత్ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, దేవస్థానం ఏఈలు, సూపరింటెండెంట్ ఇంజనీర్లు, ఈఈ తదితరులు పాల్గొన్నారు.

## తుని మున్సిపాల్టీపై పట్టుబిగించిన టీడీపీ

### మరో ఆరుగురు చేరిక 16కు పెరిగిన బలం

ప్రజాభూమి తుని



దాస్తే దాగి లేదు.వైసీపీలో అంతర్గత కలహాలకు కారకెలెవరూ బాలు కోసం..రాజా...రాజా కోసం..బాలు.అహం తలకెక్కింది.అధికారం అండతో కౌన్సిలర్లు నల్ల పూసలులా కనిపించారు.వారు ఆడింది ఆట..పాడింది పాటగా పురపాలన సాగించారూ రాజా బాలూ.ఓపిక పట్టిన కౌన్సిలర్లు టైమ్ కోసం పొంచి చూసారు.అదును చూసి నా సామిరంగా అన్నారు.పది మంది కౌన్సిలర్లు యనమల సమక్షంలో టీడీపీలోకి చేరారు.దిమ్మతిరిగిన దాడిశెట్టి రాజా కిడ్నాప్ పర్వానికి తెరలేపారు వైస్ చైర్మన్ ఎన్నికకు కౌన్సిలర్లను పంపకుండా రాజా అండ్ కో నాటకాలాడారు.లా అండ్ ఆర్డర్ ను బూచిగా పెట్టి టీడీపీపై బురదజల్లారు.చలో తునికి పిలుపు ఇచ్చి తునిని రావణకాష్టం చేయాలని చూసారు.అంతా ఓ కంట కనిపెట్టిన శాంతికాముకుడు యనమల రాజకీయ వ్యూహంతో శాంతియుతంగా హ్యాండిల్ చేసారు.జడిసిన చైర్ పర్సన్ సుధారాణి రాజీనామా చేసి ఇంటీ ముఖం పెట్టింది.ఇక కౌన్సిలర్లు అందరూ ఒకే మాటపై నిలిచారు. యనమల చెంతకు చేరారు.ఇవాళ ఆరుగురు కౌన్సిలర్లు పోలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సమక్షంలో పసుపు కండువాలు కప్పుకున్నారు.రేపో మాపో మేమూవచ్చేస్తామంటున్నారూ మిగితా కౌన్సిలర్లు.ఇదండీ తుని మున్సిపల్ వాస్తవిక కధనం.మాజీఎమ్మెల్యేరాజా అశోక్ బాబు, సీనియర్ నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి మోతుకూరి వెంకటేష్ ఇనుగంటి సత్యనారాయణ కుసుమంచి శోభారాణి సత్యనారాయణ మల్ల గణేష్ కుక్కడపు బాలాజీ తదితరులు ఆధ్వర్యంలో ఇవాళ కౌన్సిలర్లు మంతిన నాగలక్ష్మి,వాసంశెట్టి శ్రీ ను,కుచ్చర్ల పాటి రూపాదేవి,సూరిశెట్టి సుభద్ర దేవి,మలిశెట్టి ప్రభావతి తదితరులు టీడీపీలో చేరారు

## వృద్ధురాలి పై దాడి -ఐదుగురు నిందితుల అరెస్ట్

ప్రజా భూమి ప్రతినిధి కాకినాడ



ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలిపై దాడి ఘటనలో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి చోరి సొత్తు స్వాధీనం చేసుకున్నామని కాకినాడ ఎస్డీపివో, ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్, ఒకటవ పట్టణ సిఐ ఎమ్.నాగదుర్గారావు వెల్లడించారు. స్థానిక జగన్నాథపురం యానాం రోడ్డులో ఒంటరిగా నివసిస్తున్న చాగంటి శుక్రవారపు మహాలక్ష్మిపై ఈనెల 14వ తేదీన ఆమె కోడలు,జగిత్యాల జిల్లా కంట్లకుంట గ్రామానికి చెందిన చాగంటి రజిత(35),మరోముగ్గురు నిందితుల సాయంతో వృద్ధురాలి కాళ్లు చేతులు కట్టి నోటిలో గుడ్డలు కుక్కి దాడి చేసి పెట్టెలోని బంగారు ఉంగరం, చేతి గాజు ఒకటి, రూ60,000/-నగదు చోరి చేశారని బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి నిందితులు చాగంటి రజిత,ధారా రఘు(19),తోస్దర్తి లత (40), తాటి వెంకటేష్(35),స్థానిక పనిమనిషి రామలక్ష్మి(45)లను అరెస్ట్ చేసి వారి వద్దనుండి రూ.30,000/-నగదు, బంగారు గాజు (6.5గ్రాములు) ,ఉంగరం (2.70గ్రాములు), మారుతీ స్విఫ్ట్ కారు,5సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు వేగవంతంగా దర్యాప్తు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్న సీసీఎస్ సిఐ కృష్ణ,ఎస్సై వినయ్ ప్రతాప్, ఇతర పోలీసు సిబ్బందిని ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు.

## మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల పనులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించొద్దు

### యూనియన్ గౌరవ అధ్యక్షులు తాటిపాక మధు

### మున్సిపల్ కార్మికుల సమస్యలపై ధర్నా

ప్రజా భూమి ప్రతినిధి రాజమహేంద్రవరం




కూటమి ప్రభుత్వం ఆప్కాస్ ను రద్దుపరిస్తే మున్సిపల్ శాఖకే ఆ బాధ్యత వహించాలని, వీటిని ప్రైవేట్ వ్యక్తులకు, బడా కంపెనీలకు వారి ఏజెన్సీలకు అప్పచెప్పుదామనే మంత్రి వర్గ సభ్యుల అభిప్రాయాలను తీవ్రంగా పరిగణించిన అంశం అని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు తాటిపాక మధు విమర్శించారు.సోమవార%శీ% ఉదయం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు

ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమిప్రభుత్వం ఆప్కాస్ ను రద్దుపరిస్తే మున్సిపల్ శాఖ కి ఆ బాధ్యతలు అప్పగించాలని, కనీస వేతనలు 35000 చెల్లించాలని, మున్సిపల్ ఉద్యోగ కార్మికుల వేతనాలు చెల్లింపు, పనులు అప్పగింత నిర్వహణ, సాంఘిక భద్రత మున్సిపల్ శాఖకే పూర్తి బాధ్యతలు ఉండాలని ఆయన కోరారు ప్రైవేట్ కంపెనీ ఏజెన్సీలకు అప్పగించొద్దని మధు డిమాండ్ చేశారు. ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ తక్షణమే చేయాలని ఆయన అన్నారు.కార్మికులకు గత మూడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న సరెండర్ లీవ్లో ఎన్కోస్మెంట్ మరియు మూడు డిఏలు తక్షణమే విడుదల చేయాలని, ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంపుకే గత సమ్మెలో నాటి ప్రభుత్వంతో అంగీకారమైన అగ్రిమెంట్ మేరకు వేతనాలు పెంచాలని, జనాభా ప్రతిపదికన కార్మికులను పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్ని కార్మికులకువర్తించాలని, 15 సంవత్సరాలుగా రిక్షా కార్మికులకు స్కూల్స్ స్వీపర్ల వేతనాలు పెంచలేదని, తక్షణమే వారికి వేతనాలు పెంచాలని, ఏడాది కాలంగా పెండింగ్లో ఉన్న మరణించిన రిటైర్మెంట్ కార్డు ప్రస్థానంలో వారి కుటుంబ సభ్యులకు పనులు అవకాశం కల్పించాలని, రెగ్యులర్ ఉద్యోగ, కార్మికుల వలె కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల ఉద్యోగ కార్మికుల రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, మధు డిమాండ్ చేశారు పనిముట్లు కొడతా తీర్చాలని, బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని, ఆప్కోస్ మరణించిన కార్మిక కుటుంబాలకు ఉద్యాగలు ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు రెడ్డి రమణ,ప్రధాన కార్యదర్శి అల్లం వెంకటేశ్వరావు,

ఏ ఐ వై ఫ్ జిల్లా కార్యదర్శి టీ త్రిమూర్తులు, యూనియన్ అధికారబడి ధనాల దుర్గమ్మ, బంగారు గిరిబాబు, గుడుపు గిరి, నంద కిషోర్, ముత్యాల మురళి, శారద, పోలమ్మ, అల్లం బాలు, శ్రీనివాస్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు

ప్రజాభూమి


# 200 రోజులు దాటిన నిత్య అన్న సంతర్పణ

## -నిర్వాహకుల సేవలు ఆదర్శ ప్రాయం




ప్రజాభూమి, హిందూపురం

ఎంతో పేరుగాంచిన సంస్థలు పబ్లిసిటీ కోసం అన్నదాన కార్యక్రమాలు అంటూ హడా వుడి చేసి మూన్నాళ్ళ ముచ్చట గా నిర్వహించి చేతులు దులుపు కుంటున్న చేతులు దులుపుకుం టున్న తరుణంలో..... ఇందుకు భిన్నంగా హిందూపురంలో శ్రీ సద్గురు యోగి నారాయణ సేవా సమితి నిత్య అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఎంతో అంకిత భావంతో నిర్వహిస్తూ పేద వర్గాలకు కడుపు నింపుతోంది. ప్రతిరోజు ఎంతోమంది అనాధలు, వృద్ధులు, వికలాంగులు, కూలీలకు యోగి నారాయణ సేవాసమితి కడుపునిండా భోజనం పెడుతూ ఆదర్శంగా నిలుస్తోంది. హిందూపురంలోని నానెప్ప నగర్ లో శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయం పక్కన ప్రతిరోజు మధ్యాహ్నం ఒంటిగంటకు దాతలు అందజేసే ఎంతోకొంత సహకారంతో.... దాతలు ఎవరు ముందుకు రాని రోజుల్లో సొంతంగా యోగి నారాయణ సేవా సమితి అధ్యక్షులు రవిశంకర్ అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిత్యం కొనసాగిస్తుండడం విశేషం. సైకిల్ షాపును నిర్వహిస్తూ... ఓవైపు తన వ్యాపారాన్ని కొనసాగిస్తూ మరోవైపు తన షాపు ముందే నిత్య అన్నదాన కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నాడు రవిశంకర్. దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఈ అన్న సంతర్పణ కార్యక్రమానికి చేయూతనిస్తే ఎంత కాలమైనా ఉచిత సేవలు అందించేందుకు సిద్ధమని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ఇందులో భాగంగా సోమవారం 206వ రోజుకు ఈ కార్యక్రమం చేరింది. సోమవారం సింగిరెడ్డిపల్లికి చెందిన చెన్న కృష్ణ తన కూతురు సాయిరమ్య జన్మదిన సందర్భంగా 20 కిలోల బియ్యం, రెండు కిలోల కందిపప్పు ఇవ్వగా, మాకంవెంకటేష్ వేయి రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మిగిలిన వ్యయం రవిశంకర్ భరించాడు. జన్మదినం, వివాహ తదితర శుభ దినాల్లో దాతలు ఇలాంటి కార్యక్రమాలకు సహకారం అందించాలని కోరారు.

# పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 25 ఫిర్యాదులు

## -ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి - డీఎస్పీ వి కే మహేష్



ప్రజాభూమి, హిందూపురం టౌన్

పోలీసు శాఖ నేతృత్వంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హిందూపురం డిఎస్పి వీకే మహేష్ సూచించారు. సోమవారం స్థానిక ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 25 సమస్యలపై బాధితులు ఫిర్యాదులు అందజేశారు. ఇందుకు స్పందించిన డి.ఎస్.పి మహేష్ వెను వెంటనే బాధితులతో చర్చించి 22 సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరింపజేశారు. మిగిలిన సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి సోమవారం హిందూపురం వన్ టౌన్ వేదికగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని హిందూపురం సబ్ డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూపురం సీఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, జనార్ధన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యత శిబిరంలో మెరిసిన పురం విద్యార్థిని

## -అభినందించిన కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది



ప్రజాభూమి, హిందూపురం టౌన్


స్థానిక ఎన్.ఎస్.పి.ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న జే. దుర్గ, జాతీయ సమైక్యత శిబిరంలో ప్రతిభను ప్రదర్శించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం. ప్రగతి పేర్కొన్నారు. పట్టణంలోని శాంతినగర్ కు చెందిన సుబ్బు, నాగమ్మ దంపతుల కుమార్తె జే.దుర్గ, స్థానిక ఎన్ ఎస్ పి ఆర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ గా సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, ఎస్కే యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం తరఫున ఆంధ్రప్రదేశ్ బృందానికి ఎంపికై , మహారాష్ట్ర కొల్హాపూర్ శివాజీ విశ్వవిద్యాలయంలో వారం రోజులపాటు జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. మన సంస్కృతి, సాంప్రదాయాలపై ప్రసంగించి, జానపద నృత్యంలో విశేష ప్రతిభ కనపరిచి కళాశాల కీర్తిని ఇనుమడింప చేసిందన్నారు.

వారం రోజుల శిబిరాన్ని విజయవంతంగా పూర్తిచేసుకుని, ఎన్ఎస్ఎస్ ఉన్నతాధికారుల నుండి సర్టిఫికెట్ ని పొందిన దుర్గా ని కళాశాల సిబ్బంది, సహచర విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.వెంకటేషులు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. శ్రీలక్ష్మి, ఫిజిక్స్ అధ్యాపకులు ఎల్ఆర్ రమేష్, కామర్స్ అధ్యాపకులు బాలిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ బి.నరసింహులు పాల్గొన్నారు.

# శివరాత్రి ఉత్సవాలను సుహృద్భావ వాతావరణం లో జరుపుకుందాం

## శాంతి సంఘ సమావేశంలో డిఎస్పి మహేష్.

ప్రజా భూమి, లేపాక్షి



మండల కేంద్రమైన లేపాక్షిలో ఈనెల 25 నుండి నిర్వహించనున్న శివరాత్రి బ్రహ్మోత్సవాలను సహృద్భావ వాతావరణం లో జరుపుకుందామని శాంతి సంఘ సమావేశంలో డి.ఎస్.పి మహేష్ సూచించారు. సోమవారం స్థానిక ఆర్ జె హెచ్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన శాంతి సమావేశంలో డిఎస్పీ మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా లేపాక్షి ఉత్సవాల్లో పాల్గొనాలని శాంతి సంఘ సమావేశంలో నాయకులకు పిలుపునిచ్చారు. అతి ప్రాచీనమైన లేపాక్షి ఉత్సవాలకు ఎవరైనా ఆటంకం కలిగించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. కుల, మతాలకు అతీతంగా ఉత్సవాల నిర్వహించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. సోదర భావంతో ఉత్సవాలను జరుపుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ శ్రీ జనార్ధన్,ఎస్సైలు నరేంద్ర, మునీర్ అహ్మద్, వీరభద్రాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కరణం రమానందన్ ,మండల ఉపాధ్యక్షులు ఆంజన రెడ్డి, లేపాక్షి రాంప్రసాద్, వెచ్చం రవీంద్రనాథ్, వెచ్చం సుబ్రహ్మణ్యం, ముతవల్లిలు,అన్ని మతాలకు చెందిన పెద్దలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బాలకృష్ణ ఆధ్వర్యంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు

**25న సుదర్శన హెూమం తో ఉత్సవాలు ప్రారంభం.**

**వీరభద్రాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కరణం రమానందన్.**





ప్రజా భూమి ,లేపాక్షి

ప్రపంచ పర్యాటక చిత్రపటంలో పేరొందిన లేపాక్షి వీరభద్రాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు హిందూపురం శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కరణం రమానందన్ పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణపై ఆలయ ప్రాంగణంలో చైర్మన్ సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ,ఈనెల 25 నుండి మార్చి 1వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 26వ తేదీన శివరాత్రి సందర్భంగా దుర్గా ,వీరభద్రేశ్వర స్వాములకు ప్రత్యేక అలంకరణతో పాటు వేద పండితులు సునీల్ శర్మ ఆధ్వర్యంలో హెూమాలు నిర్వహిస్తామన్నారు. శివరాత్రి జాగారం రోజున సాంస్కృతిక కార్యక్రమాలు ,భక్తి గీతాల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 27వ తేదీన శివపార్వతుల బ్రహ్మ రథోత్సవం భక్తజన సందోహం మధ్యన నిర్వహించడం జరుగుతుందన్నారు. బ్రహ్మోత్సవాల్లో ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి సమస్య కలగకుండా వాలంటీర్లను ఏర్పాటు చేశామన్నారు. వృద్ధులు, వికలాంగులకు తూర్పు ద్వారం నుండి స్వామివారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాటు చేశామన్నారు. రమామణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంద న్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఆలయంలో మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేశామన్నారు. బ్రహ్మ రథోత్సవం రోజున ప్రతి ఒక్కరూ 12 గంటల లోపు దేవాలయానికి రావాలని సూచించారు. రథోత్సవం రోజున భోజనము, మజ్జిగ ,తాగు నీటిని పంపిణీ చేసేందుకు దాతలు సహకరించాల న్నారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. లేపాక్షి ఆలయానికి నిరంతర విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్ఫార్మర్ను ఏర్పాటు చేసిన విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవాలు ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా జిల్లా ఎస్పీ రత్న ఆధ్వర్యంలో భారీ ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. అదేవిధంగా సీసీ కెమెరాలతో పాటు డ్రోన్లు ఏర్పాటు చేశామన్నారు. 25, 26 తేదీల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను రద్దు చేయడం జరిగింది అన్నారు. అదేవిధంగా 108 అంబులెన్స్ తో పాటు మరో ప్రైవేట్ అంబులెన్స్ ను కూడా ఏర్పాటు చేశామని కరణం రమానందన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహ మూర్తి, ప్రధానార్చకులు లక్ష్మీ నరసింహ శర్మ పాల్గొన్నారు.

# బాడీ బిల్డింగ్ పోటీల్లో 'పురం' యువకుడికి నాలుగు పతకాలు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



వరల్డ్ ఫిట్నెస్ ఫెడరేషన్ (డబ్ల్యూ ఎఫ్ ఎఫ్) ఆధ్వర్యంలో చెన్నైలో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో హిందూపురం పట్టణానికి చెందిన నవీద్ వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి నాలుగు పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ పోటీలకు వివిధ రాష్ట్రాల నుండి 200 మంది పోటీదారులు పాల్గొన్నారు. పట్టణంలోని గోల్డెన్ జిమ్ లో శిక్షణ పొందిన నవీద్ శారీరక దృఢత్వం విభాగంలో బంగారు పతకాన్ని సాధించగా సీనియర్ బాడీ బిల్డింగ్ కేటగిరిలో సిల్వర్ పతకాన్ని, జూనియర్ బాడీ బిల్డింగ్ పోటీల్లో సిల్వర్ పతకాన్ని, క్లాసిక్ శారీరక దృఢత్వం పోటీల్లో నాలుగవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను పోటీల్లో పాల్గొనేందుకు సహకరించిన జిమ్ నిర్వాహకులు ఆరిఫుల్లాకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా జిమ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి హిందూపురం పట్టణ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేసిన నవీద్ ను స్థానిక బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

# ప్రతి గ్రామంలో పార్టీలకతీతంగా రైతు సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకోండి

## "పీఎం కిసాన్ సమ్మాన్ సమ్మేళనం"లో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ




ప్రజాభూమి బ్యూరో, అనంతపురము (రెడ్డిపల్లి):

ప్రతి గ్రామంలో పార్టీలకు అతీతంగా రైతు సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకోండి అని "పీఎం కిసాన్ సమ్మాన్ సమ్మేళనం"లో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ రైతులకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రం సమీపంలోని బుక్కరాయ సముద్రం మండలం రెడ్డిపల్లిలో ఉన్న ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం లో పీఎం కిసాన్ సన్మాన్ సమ్మేళనం కార్యక్రమంలో ఎంపీ పాల్గొని మాట్లాడారు. పిఎం కిసాన్ కార్యక్రమం ద్వారా దేశంలో రైతులందరికీ అనేక కార్యక్రమాలు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అందజేస్తున్నారని, ఎన్డీయే ద్వారా రాష్ట్ర సీఎం నారా చంద్రబాబు నాయుడు రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామంలో రైతు సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ప్రతి అవకాశాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇక అనంతపురం జిల్లాలో మామిడి పంటలకు ప్రభుత్వం పిందె దశలో మామిడికాయలకు కవర్లు ఏర్పాటు చేయడం ద్వారా మంచి పంటను పొందవచ్చని అన్నారు. జిల్లాలో పంట పండించడానికి డ్రిప్పు సిస్టం ఉపయోగించుకోవాలని వాటి ద్వారా ఎక్కువ పంటలు పండించుకోవడానికి అవకాశం ఉందని తెలియజేశారు. కేంద్రీయ పరిశోధనా స్థానం ద్వారా నిర్వహించు కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల రైతులు పంట మెలకువలు నేర్చుకొని మంచి పంటలు సాగు చేయడానికి అవకాశం ఉందని ఎంపీ తెలియజేశారు. ప్రధానమంత్రి పిఎం కిసాన్ 19వ విడత దేశవ్యాప్తంగా బటన్ నొక్కి నిధులను విడుదల చేశారు. ప్రతి సంవత్సరం మూడు దఫాలుగా కేంద్ర ప్రభుత్వం రైతులకు సహాయ సహకారం అందిస్తున్నదని తెలిపారు. ఇందులో మన జిల్లాలో రూ.57 కోట్లు మంజూరు చేశారని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. కేంద్రీయ కృషి విజ్ఞాన కేంద్రం, రెడ్డిపల్లి కార్యక్రమం కోఆర్డినేటర్ శ్రీమతి మల్లేశ్వరి మాట్లాడుతూ, ఈ పరిశోధన కేంద్రంలో రైతులకు వరి వేరుశనగ పెసర, కంది వాటికి విత్తనాలను అందజేస్తున్నామని, వర్మీ తయారీ కోళ్ల పరిశ్రమ, సాయిల్ టెస్ట్ మొదలైన సేవలు రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. రైతులకు కావలసిన సాంకేతిక, పంటలు సాగు చేయు విధానాలను, సూచనలుసలహాలు అందజేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ పరిశోధన కార్యక్రమం కోఆర్డినేటర్ శ్రీమతి మల్లీశ్వరి గారు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శ్రీమతి వసుంధర గారు, అగ్రికల్చర్ జెడి, ఉమామహేశ్వరమ్మ, హెచ్ ఓ డి భార్గవి, హార్టికల్చర్ ఆఫీసర్ నరసింహ, ప్రాజెక్ట్ డైరెక్టర్ రఘునాథ రెడ్డి, ఏపీఎంఐపీ మద్దిలేటి, ఆత్మ, మరి అనేక మంది రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పేద వర్గాలే లక్ష్యం....-గృహ ఋణాల పేరుతో మోసం

**-మంజూరు చేసిన ఋణం రూ. 3.17 లక్షలు**

**-ఖాతాలో జమ చేసింది రూ. 2 లక్షలు**

**-పేదల రక్తం పీల్చుతున్న మైక్రో ఫైనాన్స్ లు**



ప్రజాభూమి, హిందూపురం టౌన్

చిలమత్తూరు మండలం టేకులోడు గ్రామానికి చెందిన సరోజమ్మ తనకున్న స్థలంలో ఇంటిని నిర్మాణం చేసుకొని తన సొంత ఇంటి కల నెరవేర్చుకోవాలని భావించింది. అందరికీ ఇల్లు పథకంలో భాగంగా ఇల్లు మంజూరు కాలేదు. దీంతో ఎలాగైనా కష్టపడి తన సొంతింటి కలను నెరవేర్చుకోవాలనుకుని హిందూపురం పట్టణంలో ఉన్న ఓ మైక్రో ఫైనాన్స్ లో కలిసి తన స్థలానికి సంబంధించిన పత్రాలను చూపించి, 2022 వ సంవత్సరం ఆగస్టులో దరఖాస్తు చేసుకుంది. సంస్థ ప్రతినిధులు అన్ని పత్రాలను పరిశీలించిన అనంతరం రూ. 3,17,844 మంజూరు చేసింది. ఇందులో ఫైనాన్స్ సంస్థ ఫీజులు పోగా మిగిలిన రూ. 2, 89,630 లను మంజూరు చేసింది. మంజూరు చేసిన నగదు తొలివిడత ఆగష్టు 27వ తేదీన సరోజమ్మ ఖాతాకు రూ.1,00,681 జమ చేసింది. రెండవ విడత 2023 వ సంవత్సరం జూన్ నెలలో ఒక లక్ష ఫైనాన్స్ సంస్థ జమ చేసింది. మిగిలిన డబ్బులను ఇంతవరకు ఫైనాన్స్ సంస్థ సరోజమ్మ ఖాతాకు జమ చేయలేదు. రుణ మంజూరు సమయంలో ఇంటి నిర్మాణం పూర్తి అయిన తర్వాతే ఫైనాన్స్ కు చెల్లించాల్సిన నెల వారి కంతులు చెల్లించాలని పనిచేసే సిబ్బంది తెలిపారు. ఇంతవరకు ఆమెకు ఎంత ఋణం మంజూరు చేశారన్నది తెలియదు. నెల వారి కంతులు రూపంలో నెలకు ఆమె రూ. 3,812 సంస్థకు చెల్లిస్తూ వస్తోంది. ఇలా ఇప్పటికీ 21 నెలలకు గాను ఫైనాన్స్ సంస్థకు రూ.80 వేలు చెల్లించింది. ఇప్పటివరకు చెల్లించిన మొత్తం వడ్డీకే సరిపోయిందని, అసలు ఇంకా రూ. 3.17 లక్షలు చెల్లించాల్సి ఉందని ఫైనాన్స్ సిబ్బంది తెలపడంతో సరోజమ్మ ఏమి చేయాలో తెలియక పట్టణంలో ఉన్న సంబంధిత మైక్రో ఫైనాన్స్ కార్యాలయంకు వచ్చి తన ఆవేదనను కన్నీరు కార్చుకుంటూ కార్యాలయంలో ఉన్న సిబ్బంది ముందు ఆ పోయింది. ఇకపోతే సోమందేపల్లికి చెందిన మహబూబ్ తన కూతురి వివాహం కుదిరింది. అయితే డబ్బులు లేకపోవడంతో తనకు తెలిసిన వారందరిని అడిగాడు. కొంతమంది కాస్తో, కూస్తో సహకరించారు. ఆ డబ్బుతో తన కూతురి వివాహాన్ని చేయలేనని, తన ఆధీనంలో ఉన్న ఇంటిని ఎక్కడైనా తాకట్టు పెట్టి డబ్బులు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. పలువురిని అడిగితే హిందూపురం పట్టణంలో ఉన్న మైక్రో ఫైనాన్స్ లో ఇంటిని తాకట్టు పెట్టుకుని ఋణం ఇస్తారని చెప్పడంతో, తన కుమారుని సహాయంతో ఫైనాన్స్ సంస్థలు రుణం కోసం సంప్రదించారు. ఇంటి పత్రాలను చూసిన సిబ్బంది అగ్రిమెంట్ చేయడానికి కోసం రూ.3వేలు చెల్లించాలని, సబ్ రిజిస్టర్ కార్యాలయంలో మార్టిగేజ్ చేయించాలని సూచించారు. దానికి అతను రూ. 6 వేలు ఖర్చు చేసుకున్నాడు. అనంతరం పరిశీలనకు వచ్చిన ఫైనాన్స్ సంస్థ ప్రతినిధి రూ. 2500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో అతను ఆ డబ్బులు సైతం చెల్లించారు. అన్ని పూర్తి అయిన తర్వాత మాబు సాబ్ కు రూ. 3.18 మంజూరు అయినట్లు, లోన్ ప్రాసెసింగ్ ఫీజు పట్టుకొని మిగిలిన రూ. 2.90 లక్షలు ఖాతాకు జమ అయినట్లు సెల్ ఫోన్ కు మెసేజ్ వచ్చింది. అయితే ఇప్పటి వరకు డబ్బులు మాత్రం వారి ఖాతాకు జమ కాలేదు. డబ్బులు జమ కాకపోయినప్పటికీ మొదటి నెల కంత చెల్లించాలని సంస్థ నుంచి ఫోన్లు వచ్చాయి. ఖంగుతిన్న అతను పట్టణంలో ఉన్న సంబంధిత ఫైనాన్స్ కార్యాలయం కు వచ్చి తన ఆవేదనను సిబ్బంది ముందు వ్యక్తం చేశారు. కార్యాలయంలో తన రుణానికి సంబంధించి పరిశీలన చేస్తే పత్రాలు సరిగా లేకపోవడంతో రుణం మంజూరు కాలేదని సిబ్బంది చెప్తున్నారు. రిజిస్టర్ పత్రాలు లేని కారణంగా రుణం మంజూరు కాదని వారు పేర్కొన్నారు. దీంతో తన ఇంటికి సంబంధించిన పత్రాలను ఇవ్వాలని సిబ్బందిని ఆయన అడిగాడు. రూ. 1300 చెల్లించి, సబ్ రిజిస్టర్ కార్యాలయంలో మార్టిగేజ్ ను రద్దు చేసుకుని రావాలని సూచించారు. ఇప్పటికే తనకు రుణం మంజూరు కాకపోయినప్పటికీ దాదాపు రూ.15 వేలకు పైగా ఖర్చుపెట్టుకున్నానని, ఇప్పుడు మళ్లీ రద్దు చేయడానికి దాదాపు రూ.5వేలు ఖర్చు అవుతుందని, తనకు రుణం మంజూరు చేయకుండానే రద్దు ఎందుకు చేయాలని, తన వద్ద అంత డబ్బు లేదని సిబ్బంది ముందు కన్నీరు కార్చినప్పటికీ, ఫైనాన్స్ నిబంధనల పేరుతో అతన్ని బయటకు పంపారు. ఇది ఒక్క సరోజమ్మ, మాబు సాబ్ లకే కాదు. ఎంతోమంది మైక్రో ఫైనాన్స్ సంస్థలో రుణాలు తీసుకుని, నేటికీ వారు తీసుకున్న రుణాలకు కేవలం వడ్డీలనే చెల్లిస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా గత రెండు, మూడు సంవత్సరాలుగా విచ్చలవిడిగా మైక్రో ఫైనాన్స్ లు పుట్టుకు వచ్చి అవసరం లేకపోయినప్పటికీ సిబ్బంది కొంతమంది పేదలే లక్ష్యంగా ఎంచుకుని, వారి అవసరాలను ఆసరాగా చేసుకుని మీ ఇంటి పత్రాలను తీసుకొని వస్తే తమ సంస్థ అరగంటలో రూ. 2 లక్షల నుంచి 10 లక్షల వరకు ఋణం మంజూరు చేస్తుందని ఆశ కల్పించి రుణాలను మంజూరు చేస్తున్నారు. తీసుకున్న రుణాలకు సంబంధించి ప్రతినెలా సిబ్బంది చెప్పిన విధంగానే నెలవారీ కంతులను చెల్లిస్తున్నారు. ఋణం పొందిన పేదలు చెల్లిస్తున్న నెలవారీ కంతులు ఫైనాన్స్ సంస్థ వడ్డీలకు వడ్డీ వేసి వారు కడుతున్న కంతులను ఇచ్చిన ఋణానికి వడ్డీ రూపంలోనే జమ చేసుకుంటున్నారు. చెల్లించే కంతులను వడ్డీ కింద ఫైనాన్స్ సంస్థ జమ చేసుకుంటే, తీసుకున్న ఋణాలు ఎప్పుడు తీరుతాయని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి ప్రత్యేక అధికారులతో విచారణ చేయిస్తే మైక్రో ఫైనాన్స్ లో ఋణాలు తీసుకుని, నేటికీ వడ్డీలు చెల్లిస్తున్న వివరాలు బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. సమగ్ర విచారణ జరిపి పేదలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను పలువురు ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

# రైతుల రికార్డుల రిజిస్ట్రేషన్ ఆమోదం

## - వీఆర్వోలఅవగాహన సమావేశం

ప్రజాభూమి, ముద్దనూరు



స్థానిక తాసిల్దార్ కార్యాలయం ఆవరణంలో సోమవారం ప్రజా వేదిక ముగిసిన అనంతరం తాసిల్దార్ వరద కిషోర్ ఆధ్వర్యంలో రైతు పట్టాల రిజిస్ట్రేషన్ పై విఆర్వోలకు అవగాహన కార్యక్రమం వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామ స్థాయిలో సొంత పొలం కలిగిన రైతులకు రిజిస్ట్రేషన్ చేసారని ఆ వివరాలు మరల గ్రామ రెవెన్యూ అధికారుల లాగిన్ లో పున పరిశీలించి ఆమోదం చేస్తే తహసీల్దార్ లాగ్ ఇన్ లో పరిశీలించి ఆమోదిస్తారు అని తెలిపారు. అందులో భాగంగానే గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి రికార్డులను ఎలా తనిఖీ చేయాలి ఎలా ఆమోదించాలి అనే విషయాల వీఆర్వోలకు అవగాహన కల్పించారు. అలాగే మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 3105 మంది రైతులకు రిజిస్ట్రేషన్ పక్రియ రైతు సేవా కేంద్ర సిబ్బంది పూర్తి చేసారని తెలిపారు. ఈ రికార్డులను అన్నిటినీ కూడా గ్రామ విఆర్ ఓ లు పరిశీలించి ఆమోదించాలి అన్నారు. ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలి అన్నారు. ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ రికార్డులు పెండింగ్ లేకుండా చూసి మండలం ప్రగతిని ముందంజలో ఉంచాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రెవెన్యూ అధికారులు ,పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దుస్తుల పంపిణీ

ప్రజాభూమి పోరుమామిళ్ల:




పోరుమామిళ్లలోని చిత్తా శౌరి రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సహా కారంతో మండలం లోని ఈదుళ్లపల్లె, గుర్రప్పగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 116 మంది బాల బాలికలకు సంస్థ వ్యవస్థాపకులు చిత్తా తోమాస్ రెడ్డి, డాక్టర్. గీతా దంపతులు ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు. వీటిని సంస్థ ప్రతినిధి ప్రసాద్ రెడ్డి, జి శ్రీకాంత్ రెడ్డిలు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ విద్యార్థినులను ప్రోత్స హించాలని ఉద్దేశంతో చిన్న బహుమానంగా ఈ దుస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయినిలు, విద్యార్థినులు హాజరై సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఒంటిమిట్ట చెరువుకు నీరు నింపాలి

ప్రజాభూమి ఒంటిమిట్ట



ఒంటిమిట్ట చెరువుకు శ్రీరామ ఎత్తిపోతల పథకం ద్వారా నీరు నింపాలని ఒంటిమిట్ట చెరువు ఆయకట్టు సంఘ వైస్ చైర్మన్ కట్టా యానాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సోమవారం ఒంటిమిట్ట తాసిల్దార్ ఈ మేరకు వినతిపత్రం అందించారు ఒంటిమిట్ట చెరువుకు నీరు సరఫరా చేసే పైపులు పగిలిపోవడంతో గత వారం రోజులుగా నీరు సరఫరా కాలేదు అన్నారు ఒంటిమిట్ట చెరువులో నీరు లేకపోవడంతో తాగునీరు సాగునీరు లేక ప్రజలు అవస్థలు పడతారన్నారు ఏప్రిల్ నెల జరిగే కోదండ రాముని బ్రహ్మోత్సవాలకు తాగునీరు లేక ఇబ్బంది పడతారని వాపోయారు ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ అధికార స్పందించి ఒంటిమిట్ట చెరువుకు నీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు

# అరుణాచల ఫుడ్స్ సెంటర్ను ప్రారంభించిన రీజినల్ శ్రీనివాస ప్రసాద్


ప్రజాభూమి, పులివెందుల



కొత్త రుచులకు చిరునామా అరుణాచల ఫుడ్స్ అని పలువురు ఆహార ప్రియులు ప్రశంసించారు. పులివెందుల పట్టణంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ వారి సౌజన్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన అరుణాచల ఫుడ్స్ ను బ్యాంకు రీజినల్ మేనేజర్ శ్రీనివాస ప్రసాద్ రిబ్బన్ కట్ చేసి సోమవారంప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార అభివృద్ధికి తమ బ్యాంకు ఎంతో చేయూత అందిస్తుందని ఆయన తెలిపారు. యజమాని నాగరాజు తో వచ్చే వారికి నాణ్యమైన ఫుడ్స్ అందియాలని అప్పుడే మంచి పేరు వస్తుందని ఆయన తెలిపారు. అంతకు ముందుగా పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీనివాసులు దుష్యా ల్వాతో ఆయనను సత్కరించి తీర్థ ప్రసాదా లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ (మెయిన్ ) సీనియర్ మేనేజర్ శ్రీధర్, ఫీల్డ్ ఆఫీసర్ కిషోర్ కుమార్ రెడ్డి, శశిధర్, అసిస్టెంట్ మేనేజర్ ఉమామహేశ్వరి, రవీంద్రనాథ్ రెడ్డి, ఎస్ ఆర్ కె మేనేజర్ మహేంద్ర నాయక్, క్యాషియర్ చలపతి తదితరులు పాల్గొన్నారు.

# శివరాత్రి నాడు శివపార్వతుల కళ్యాణం

ప్రజాభూమి, ప్రొద్దుటూరు



: పెన్నానది తీరాన రామేశ్వరంలో వున్న శ్రీ రాజరాజేశ్వరి సమేత శ్రీ ముక్తి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం 4 గంటల నుంచి స్వామి వారికి పంచామృతాభిషేకం, ప్రసాద వితరణ, మద్యాహ్నం12 గంటలకు అన్నప్రసాద సేవ, సాయంత్రం దేవస్థానం నందు శివ పార్వతుల కళ్యాణ మహోత్సవం, రాత్రి 8 గంటలకు భక్తులకు అల్పాహారం, రాత్రి 9 గంటల నుంచి రామేశ్వరం పురవీధుల్లో స్వామి వారి గ్రామోత్సవం, తదుపరి రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో మహన్యాస రుద్రాభిషేకం జరుగుతాయని వివరించారు. కావున భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

# ఆర్టీసీ బస్టాండ్ ను ప్రారంభించాలి

## - బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్

ప్రజాభూమి, వేంపల్లె



ఐదు మండలాల కూడలిగా ఉన్నటువంటి వేంపల్లి ఆర్టీసీ బస్టాండ్ ను ప్రారంభించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, బీజేపీ పులివెందుల అసెంబ్లీ కన్వీనర్ మహేశ్వర్ రెడ్డి లు కోరారు. ఈ మేరకు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్ రెడ్డి ని కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ బస్టాండ్ పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్న ప్రారంభించకపోవడంతో ప్రయాణికులు ప్రజలు మరుగుదొడ్లకు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు, కావున ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బస్టాండ్ ను త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లుగా చెప్పారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఆర్ఎం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

# పేదవాడి సొంతింటి కల ఇంటి పట్టా ఇచ్చి మాట నెరవేర్చాలి: సీపీఐ

**సీపీఐ ఆధ్వర్యంలో ఐదు ప్రాంతంలో భూ పోరాటాలను ఉన్న పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఐ డిమాండ్**

ప్రజాభూమి పోరుమామిళ్ల:







పోరుమామిళ్ల పట్టణంలో స్థానిక తాసిల్దార్ కార్యాలయం వద్ద కూటమి ప్రభుత్వం చెప్పిన వాగ్దానం ప్రకారం నియోజకవర్గంలోని తిరుపతిరెడ్డి కాలనీ భగత్ సింగ్ కాలనీ, పిపి కుంట, భాకరాపేట, సి కొత్తపల్లె కాలనీలలో ఉన్న ప్రతి పేదవాడికి రెండు సెంట్లు ఇంటి పట్టా ఇవ్వాలని సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, పట్టణ సహాయ కార్యదర్శి కేశవులు పాలక ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ పోరుమామిళ్ల తాసిల్దార్ కార్యాలయం వద్ద చెన్నయ్య అధ్యక్షతన జరిగిన ధర్నాలో బద్వేల్ నియోజకవర్గం లో ఏడు మండలాలలో 30 వేల ఎకరాలు ప్రభుత్వ భూమి కబ్జా చేసి, జామాయిలు, బొప్పాయి, సపోటా, మామిడి వంటి పండ్లతోటలు వేసుకొని రికార్డులను తారుమారు చేసి గుంటూరు విజయవాడ విశాఖపట్నం ప్రాంతాల్లో ఉన్న వారికి అమ్ముకొని లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్న భూ బకాసురులను రెవెన్యూ అధికారులు పట్టించుకోకుండా కేవలం రెండు సెంట్లు ఇంటి జాగా కోసం రాత్రనకా పగలనకా, ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ,సిమ్మ చీకట్లో నివాసముంటున్న పేదలకు ఇంటి పట్టాలి ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా డిమాండ్ చేస్తున్నాం. అలాగే 11 సంవత్సరాలు కాపురం ఉంటున్న తిరుపతి రెడ్డి కాలనీ వాసులకు మౌలిక సదుపాయాలు కల్పించి పేదల పక్షాన నిలబడాలని, గత నెలలో సచివాలయాల్లో ఇచ్చిన అప్లికేషన్లను ఎంక్వయిరీ చేసి అర్హుల జాబితా తీర్చాలని వారు కోరారు లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేసి, రిలే దీక్షలు చేపడతామని వారు అధికారులను హెచ్చరించి అనంతరం తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి కి వినతిపత్రం అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు చెన్నయ్య,, ఏఐటీయూసీ మండల అధ్యక్ష కార్యదర్శులు సఫా, పిరయ్య, ఓబులేసు, శ్రీనివాసులు జ్యోతి, నాయబ్, హసన్ వల్లి, సాహిదా, విశ్వాసమా, గురమ్మ, రామసుబ్బయ్య, శ్రీను వెంగయ్య,మండలంలో నిరుపేదలు పాల్గొన్నారు.

# ప్రతి వార్డుకు నీటి సమస్య లేకుండా నీరు అందించడమే లక్ష్యం

**వచ్చే వేసవికాలం కు నీటి సమస్య లేకుండా చేస్తాము**

**నక్కలపల్లి సమ్మర్ స్టోరేజ్ పనులు పరిశీలించిన కమిషనర్, తూగుట్ల మధుసూదన్ రెడ్డి**

ప్రజాభూమి, పులివెందుల



మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా చర్యల్లో భాగంగా నక్కలపల్లి సమ్మర్ స్టోరేజ్ పనులను ప్రారంభించారు. అందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ రాముడు , డి ఈ చిదానంద రెడ్డి, ఏఈ వెన్నెల ,తెలుగుదేశం నాయ కులు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధు సూదన్ రెడ్డి సమ్మర్ స్టోరేజ్ పనులను సోమవారం పరిశీలించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 ఫైనాన్ సి కమిషన్ సంబంధించి పనులు చేసేందుకు నిధులు మంజూరు కావడంతో దాదాపు 70 లక్షల రూపాయలతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకకు 3మోటర్, పైపులైన్లకు సంబంధించి వాటిని బిగించి పంపుల ద్వారా నీటి సమస్య పరిష్కరించేందుకు పనులు ప్రారంభించినట్లు వారు తెలిపారు. అలాగే పులివెందుల పట్టణంలో రానున్న వేసవికాలంలో నీటి సమస్య తలైతకుండా ఉండేం దుకు చర్యలు తీసుకోవాలని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వచ్చే వేసవి కాలం లో ప్రతి వార్డుకు నీళ్లు అందించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు చిన్న రంగాపురం సుబ్బారెడ్డి, సారాయిపల్లి అంకాల్ రెడ్డి, సిద్దయ్య, అక్రమ్, సుధాకర్ రెడ్డి, తెదేపా నాయకులు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పులివెందుల మున్సిపల్ ఎన్నికలలో సినిమా చూపిస్తాం

**ప్రజా సమస్యలు పట్టని జగన్.. పదవి భయంతో అసెంబ్లీకి**

**మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి**

ప్రజాభూమి, పులివెందుల



మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పదవి భయంతో అసెంబ్లీకి అలా వెళ్లి ఇలా వచ్చా డని అంతే తప్ప అసెంబ్లీలో ప్రజల సమస్యల గళం వినిపించాలి అనేది ఏమాత్రం లేదని మాజీ ఎమ్మెల్సీ, టిడిపి పులివెందుల నియోజకవర్గ ఇన్చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బిటెక్ రవి) అన్నారు. సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తన ప్యాలెస్ లోకి పోయి వచ్చినట్లు ఉందని అసెంబ్లీకి పోయినట్లు లేదన్నారు. ప్రజల సమస్య లగురుంచి అసెంబ్లీలో గళం వినిపిస్తాడనుకుంటే సంతకం చేసి రావడం సిగ్గుచేటన్నారు. గత 15 రోజుల క్రితం ఆర్టికల్ ప్రకారం అసెంబ్లీకి రాని శాసనసభ్యుల సభ్యత్వాలను రద్దు పరచవచ్చు అని రఘురామకృష్ణం రాజు చెప్పిన మాటలకు భయపడి సంతకం చేయటానికి అసెంబ్లీకి వచ్చాడే తప్ప మరొకటి లేదన్నారు. వాజ్పేయి, జైపాల్ రెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య ఒక సీటు ఉండి పార్ల మెంటులో మాట్లాడలేదా? , సిపిఎం నోముల నరసింహులు అసెంబ్లీలో కూడా మాట్లాడారని ఆయన గుర్తు చేశారు. పులివెందులను భ్రష్టు పట్టించిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. జగన్ పులివెందుల పర్యటనకు వస్తే బిల్లులు రావాల్సిన కాంట్రాక్టర్లు మాత్రమే వస్తున్నా రని, కార్యకర్తలు, జగన్ కోసం రావడం లేదన్నారు. వైయస్ కుటుంబం కోసం కష్టపడిన కార్యకర్తలకు కనీసం బిల్లులు కూడా చెల్లించకపోవడం దారుణం అన్నారు. జగన్ నిర్లక్ష్యంతో కాంట్రాక్టర్లు వీధిన పడ్డారని ఆయన అన్నారు. అలాగే వైయస్.జగ న్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వేల కోట్లు అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని గొప్పగా చెప్పుకుంటున్నారని, పులివెందులలో అభివృద్ధి జరిగి ఉంటే గత ఎలక్షన్లలో పోల్చుకుంటే ఈ ఎలక్షన్లలో 30 వేల మెజార్టీ ఎందుకు తగ్గింది అని? ఆయన ప్రశ్నించారు. పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డికి నిజంగా మతి భ్రమించిందని మంగళగిరి, పిఠాపురం,కుప్పం, పులివెందులతో పాటు రాజీనామాలు చేయమని చెప్పడం చూస్తే నిజంగా మతిభ్రమించిందని చెప్పవచ్చు అన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ బాబులు ఎన్నికలలో గెలిచి అసెంబ్లీకి వెళ్తున్నారని, ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీకి జగన్ లాగా పోకపోతే రాజీనామా చేస్తారన్నారు. ముఖ్యంగా అవినాష్ రెడ్డి షర్మిల, సునీతల ఫోటోలను పెట్టుకోవాలని వారు లేకపోతే అవినాష్ రెడ్డి ఓడిపోయే వార న్నారు. జగన్ అసెంబ్లీకి పోతే సినిమా చూపిస్తాడు అని అవినాష్ రెడ్డి పేర్కొనడం ఆస్యాస్పదంగా ఉందన్నారు ఇంతవరకు ఎన్నో సినిమాలు చూశారని,రాబోయే పులివెందుల మున్సిపల్ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ల స్థానాలు గెలిచి తాము సినిమా చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్ రెడ్డి, తెలుగుదేశం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి సందర్భంగా శివాలయంలో విశేష పూజలు

ప్రజాభూమి, ప్రొద్దుటూరు:



పట్టణ నడిబొడ్డున వున్న అగస్త్యేశ్వరాలయంలో మహాశివరాత్రి పర్వదినం ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో కె రామచంద్రాచార్యులు, ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామి రెడ్డి మరియు ధర్మకర్తల మండలి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం ఆలయంలో తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవతో ప్రారంభమై మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చనలు ఉదయం 6 గంటలకు రుద్రహోమము 10 గంటలకు బ్రహ్మశ్రీ విద్వాన్ సొట్ట సాంబమూర్తి వ్యాఖ్యానంతో కూడి శివపార్వతుల కళ్యాణ మహోత్సవము రాత్రి 7 గంటలకు శ్రీ గణేష్ కోలాట బృందం వైఎంఆర్ కాలనీ సరస్వతీ విద్యా మందిరం వారిచే కోలాటం ఏడు గంటలకు శివపార్వతులను ప్రొద్దుటూరు తిరువీధులలో ఊరేగింపు 8 గంటలకు కొవ్వూరు రమేష్ రెడ్డి వీరి ధర్మపత్ని జయమ్మ వారిచే భక్తులకు అల్పాహారము 9:30 గంటలకు తిరుపతి వాస్తవ్యులు మధు మధుర గాయని ఆల్ ఇండియా రేడియో టీవీ కథకురాలు ఎమ్ పూర్ణ భాగవతారనిచే గొప్ప హరికథ గానము 10 గంటలకు లింగోద్భవ కాలమునందు స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకము మరియు లక్ష బిల్వార్చన కార్యక్రమములు చాలా ఘనంగా జరుగుతున్నా యని వివరించారు. కావున భక్తాదులు వచ్చి స్వామి అమ్మవార్లను దర్శించి తరించి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

ప్రజాభూమి, ప్రొద్దుటూరు




పట్టణంలోని ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు పట్టణంలోని సెయింట్ జోసెఫ్ హై స్కూలోని 1996 పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేయడం జరుగుతున్నని అందులో భాగంగా అనిబిసెంట్ మున్సిపల్ మున్సిపల్ హైస్కూల్ లోని 10వ పదవ తరగతి చదువుతున్న 98 మంది విద్యార్థులకు సోమవారం విద్యాసామాగ్రి అందించారు. ఈ కార్యక్రమానికి సెయింట్ జోసెఫ్ 1996 బ్యాచ్ కు చెందిన డాక్టర్ శ్రీ రంజన్ సహకారంతో గత 3 సంవత్సరాల నుండి నిర్వహించడం జరుగుతున్నదని అలాగే తాను ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా నిర్వహిస్తున్న ప్రతి కార్యక్రమానికి 1996 బ్యాచ్ కు చెందిన తన మిత్రుల సహాయం చాలా ఉందని సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి సావిత్రి పాల్గొని విద్యార్థులు ఒత్తిడికి గురి అవ్వకుండా ఏకాగ్రహతతో పరీక్షలకు సిద్ధం కావాలని తెలిపారు. ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవాధ్యక్షుడు చిప్పగిరి ప్రసాద్ మాట్లాడుతూ సెయింట్ జోసెఫ్ 1996 బ్యాచ్ పూర్వపు విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నా కూడా తన తోటి మిత్రుడు చేస్తున్న సేవా కార్యక్రమాలకు తమ వంతు సహాయం చేయడం అందులో భాగంగా ఈ కార్యక్రమానికి సహకరించన డాక్టర్ రంజన్ కి అభినందనలు తెలిపారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురప్ప మాట్లాడుతూ ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా తమ స్కూల్ లోని 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేయడం సంతోషమని స్కూల్ తరపున ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ వారికి కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఆదరణ సంస్థ ప్రధాన కార్యదర్శి కుండా మాధవ, రాంబాబు పాల్గొన్నారు.

## ఎంపిజె రాయలసీమ ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం

ప్రజాభూమి, ప్రొద్దుటూరు

పట్టణంలోని సైదా గారి వీధిలో మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయాన్ని ఎంపీజీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ అబ్దుల్ ఖదీర్ మరియు ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రజాక్ చేతుల మీదుగా ప్రారంభించారు. అలాగే అబ్దుల్ ఖదీర్ మాట్లాడుతూ ఎంపీజే రాష్ట్ర వ్యాప్తంగా బాధితులకు అండగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ వారికి అందే విధంగా ప్రయత్నం చేస్తుందని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం. ఎంపీజే రాయలసీమ ఇంచార్జ్ ఎండి అయూబ్ ఖాన్. జిల్లా అధ్యక్షులు జాకీర్. పట్టణ అధ్యక్షులు హుస్సేన్ భాష కార్యదర్శి రఫిక్. సభ్యులు రవి. అల్లా బకాష్ సభ్యులు పాల్గొన్నారు.



## ఆప్కాస్ రద్దు పై మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల నిరసన ర్యాలీ




ప్రజాభూమి మార్కాపురం

ఆప్కాస్ రద్దును వెంటనే ఉపసంహరించుకోవాలి. సిఐటియు పట్టణ అధ్యక్షులు షేక్ కాసిం ఆధ్వ ర్యంలో స్థానిక సిపిఐ కార్యాలయం నుండి మున్సిపల్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వ హించిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు.మున్సిపల్ పారిశుద్ధ్య.కార్మికులకు ఆప్కాస్ రద్దుని ఉపసం హరించుకొని న్యాయం చేయాలని సిఐటియు నాయకులు కాసిం డిమాండ్. చేశారు లేకపోతే ప్రభు త్వంపై మున్సిపల్ కార్మికులతో ఉద్యమం చేపడతామంటు సిఐటియు నాయకులు కాసిం ప్రభుత్వాన్ని హెచ్చరించారు.అనంతరం మున్సిపల్ కమిషనర్ కు సమస్యల పరిష్కారానికి వినతి పత్రం సమర్పించారు.

## కృష్ణ చైతన్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సయ్యద్ గౌస్ మోహిద్దీన్



ప్రజాభూమి మార్కాపురం

మార్కాపురం తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్న శ్రీ కృష్ణ చైతన్య, ఆయన తండ్రి అన్నా రాంబాబు కంటే మరింత ఎదగాలని వైసీపీ నాయకులు సయ్యద్ గౌస్ మోహిద్దీన్ ఆకాంక్షించారు. అన్న కృష్ణ చైతన్య గారి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయనకు సయ్యద్ గౌస్ మోహిద్దీన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తండ్రికి చేదుడు వాదోడుగా ఉన్న అన్నా కృష్ణ చైతన్య అన్నా రాంబాబు కి తగ్గ తనయుడుగా పేరు తెచ్చుకున్నారని ప్రశంసించారు. కిట్స్.విద్యాసంస్థల.నిర్వహణలోనూ రాజకీయాలలోనూ తన సత్తాను అన్నా య ప్రదర్శించారని పేర్కొన్నారు. మునుముందు అన్నా రాంబాబు కంటే మరింత ఉన్నత స్థానం.కృష్ణ. చైతన్యఅధిరోహించాలని ఆయనపేర్కొన్నారు. రాజకీయాలలో కూడా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నా శ్రీ చైతన్య గురించి ప్రార్థిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అన్నా రాంబాబు వెంట పార్టీ నేతలు కార్యకర్తలు ఎలా అండగా ఉన్నారో అన్నా కృష్ణ చైతన్య కి కూడా అలాంటి సహకారమే అందుతుందని సయ్యద్ గౌస్ మోహిద్దీన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్, పంభి వెంకట్ రెడ్డి, కరిముల్లా పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో ఏర్పాటు చేయాలి బిజెపి నాయకులు వినతి



ప్రజాభూమి మార్కాపురం

మార్కాపురం భారతీయ జనతా పార్టీ నాయకులు సబ్ కలెక్టర్ ని కలిసి మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడమైనది స్పందించిన కలెక్టర్ అందరికీ అధికారులకుసర్క్యులర్ రూపంలో తెలియపరుస్తారని తెలపడం జరిగినది అదేవిధంగా మార్కాపురం ఎమ్మార్వో చిరంజీవి ని కూడా కలిసి చిత్రపటాన్ని తాసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేయుటకు బహుకరించడం జరిగినది మరియు మార్కాపురం రైల్వే స్టేషన్ మాస్టర్ కూడా ప్రధాని చిత్రపటం ఇవ్వడం జరిగినది ప్రభుత్వ కార్యాలయాలలో అందరూ అధికారులుముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలతో పాటుగా ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో కూడా ఉంచాలని భారతీయ జనతా పార్టీ తరపున కోరుచున్నాము ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పాదర్తి ఆంజనేయులు పట్టణ మహిళా ఉపాధ్యక్షురాలు మిరియాల వాసుప్రియ జి సతీష్ రామకృష్ణ ఎస్ వెంకటేశ్వర రెడ్డి శివప్రసాద్ డి కాసిం వెంకటేశ్వర్లు నియోజకవర్గం ఇంచార్జ్ పివి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు

## సాంస్కృతిక ఉత్సవ్ పోస్టర్ ను ఆవిష్కరించిన డాక్టర్ సతీష్



ప్రజాభూమి మార్కాపురం

మార్కాపురం శామ్యూల్ జార్జ్ ఫారం మసి ఫార్మసీ కళాశాలలో ఎస్ జి ఐ పి ఎస్ స్పోర్ట్స్ కార్నివాల్ 2k 25 మరియు సాంస్కృతి ఉత్సవ్ 20 25 ఈవెంట్స్ యొక్క పోస్టర్స్ ను ఆవిష్కరించడం జరిగినది ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ డాక్టర్ ఆదిమూలపు సతీష్ గారు మాట్లాడుతూ మార్చి 6 తేదీ నుండి 9వ తేదీ వరకు జరగబోవు SGIPS స్పోర్ట్స్ కార్నివాల్ 2K25 కి మార్కాపూర్ డివిజన్ స్థాయిలో ఫార్మసి కాలేజీలు ప్రొఫెషనల్ కాలేజీలు మరియు డిగ్రీ కాలేజీలో యందలి విద్యార్థులు పాల్గొనవలయునని తెలియజేశారు ఇందులో క్రికెట్ వాలీబాల్ కబడ్డీ షటిల్ క్యారమ్స్ వంటి పోటీలు జరుగునని తెలియజేశారు అలాగే మార్చి 4వ తేదీ నుండి 8 వ తేదీ వరకు జరగబోవు సాంస్కృతి ఉత్సవ్ 20 25 కార్యక్రమంలో కూడా సింగింగ్ ఆర్ట్ కాంపిటీషన్ డాన్స్ ఫన్ గేమ్స్ డ్రామాలు మరియు రీల్స్ మొదలగు పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో డాక్టర్ వై రాజా జయ రావు ,డాక్టర్ సునీత డాక్టర్ అశోక్ ముజీబ్ మరియు కళాశాల అధ్యాపక బృందం అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## ఉచిత మెగా మెడికల్ క్యాంప్ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ ఏలూరి



ప్రజాభూమి హైదరాబాద్

భారత ప్రధాని నరేంద్ర మోడీ సేవా స్ఫూర్తితో హైదరాబాదులోని రసూల్పురాలో లీ ఫార్మా లిమిటెడ్ సహకారంతో క్రియా సంఘ్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ సోమవారం నాడు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా ఎస్ఆర్సి లేబరటిస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏలూరి రామచంద్రరెడ్డి హాజరై,లీ ఫార్మా లిమిటెడ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను గురించి మాట్లాడటం సంతోషంగా ఉందని తెలిపారు.లీ ఫార్మా లిమిటెడ్ వారి సహకారంతో మహాశివరాత్రి సందర్భంగా ఇప్పటికే శ్రీశైలం నడకదారిన వెళ్లే భక్తులకు ఉచితంగా ఔషధాల పంపిణీ కార్యక్రమం జరుగుతోందని తెలిపారు.ఈ కార్యక్రమానికి లీ ఫార్మా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట రెడ్డి,రిటైర్డ్ డిజి హూడా,పారిశ్రామికవేత్త సివి రావు,ప్రముఖ వైద్యులు డాక్టర్ సి ఎల్ వెంకటరావు,కే ఎస్ ఏస్ జనరల్ సెక్రెటరీ నయీమ్ పాషా తదితరులు హాజరయ్యారు

## వైయస్ జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరవ్వాలి పోవడం?రావడం? కాదు ప్రజల సమస్యలపై గళం విప్పాలి

### పులివెందుల నియోజక వర్గ కాంగ్రెస్ ఇంచార్జి మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి



ప్రజాభూమి, పులివెందుల

ప్రజాస్వామ్యానికి అత్యంత విలువైన వేదికను వైయస్ జగన్ నిర్వీర్యం చేస్తున్నారని, ప్రజల పక్షాన పోరాడి ప్రజల మన్నలను పొందాలి కానీ లేని రాని ప్రతిపక్ష హోదా కోసం సభను వాకౌట్ చేయడం దుర్మార్గమని మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆనాడు అసెంబ్లీకి వెళ్లిన జగన్ ఇంతవరకు అసెంబ్లీ వైపు చూడకపోవడం హాస్యాస్పదమన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన రోజు అసెంబ్లీకి పులివెందుల నియోజక వర్గ ఎమ్మెల్యే వైయస్ జగన్మోహన్ రెడ్డి వెళ్లి,మళ్లీ ఈరోజు పోయి కేవలం ఏడు నిమిషాల్లో వాకౌట్ చేయడం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్రానికి ప్రత్యేక హోదా గురించి ,సూపర్ సిక్స్ పథకాలు, పులివెందుల నియోజకవర్గ సమస్యల గురించి పోరాడాల్సింది పోయి ఇవ్వని వ్యక్తిగత ప్రతిపక్ష హోదా అడగటం లేని బలాన్ని రాని బలాన్ని వైసీపీని ప్రతిపక్ష హోదా ఎలా ఇస్తారని ఆ మాత్రం కూడా అవగాహన లేకుండా జగన్మోహన్ రెడ్డి దానికోసం పోరాటం చూస్తే ఆయనకు ప్రజాస్వామ్య విలువలు ఎక్కడ ఉన్నాయని ధ్రువ కుమార్ రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ నిబంధనల ప్రకారం ఒక సభ్యుడు 60 రోజులు అసెంబ్లీకి రాకపోతే అనర్హత వేటు వేయవచ్చని నిబంధనలో ఉంది కాబట్టి ఈరోజు తన స్వార్థం కోసం వచ్చాడే తప్ప ప్రజల సమస్యలు వెలుగెత్తుదామని వారికి అండగా ఉందామని ఏ కోశానా మచ్చుకైనా జగన్ లో కనపడటం లేదని ఎద్దేవా చేశారు.అదే కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు గెలిచినా ఈరోజు ప్రభుత్వాన్ని ముప్పతిప్పుల పెట్టించే వాళ్ళమని ఇకనైనా జగన్మోహన్ రెడ్డి బేషజాలకు పోకుండా అనేక కోట్లతో ప్రజాదనంతో నిర్వహిస్తున్న అసెంబ్లీకి వెళ్లి ప్రజలకు జరుగుతున్న అన్యాయం పట్ల ప్రభుత్వాన్ని నిలదీస్తారని ధ్రువ కుమార్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

## వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని వదిలే ప్రసక్తే లేదుచివరి శ్వాస వరకు వైకాపా పార్టీ వీడం

### ఎంపీని సన్మానించిన వైకాపా నాయకులు



ప్రజాభూమి, పులివెందుల

చివరి శ్వాస ఆగేంత వరకు వైకాపా పార్టీని వీడే ప్రసక్తే లేదని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్ లక్ష్మీప్రసన్న, రాజశేఖర్ రెడ్డి, మాజీ చైర్మన్ చిన్నప్ప, మాజీ డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, వైకాపా నాయకులు పద్మనాభరెడ్డి, కోళ్ల భాస్కర్, రవి, సోపాల వీర లు అన్నారు. సోమవారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి నివాసంలో ఆయనను కలిసి దుశ్శాలువాలతో,పులహారంతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ఎవరో కొంతమంది కౌన్సిలర్లు డబ్బులకు ఆశపడి వెళ్లారన్నారు. మేము మాత్రం చివరి శ్వాస ఆగేంతవరకు వైఎస్ కుటుంబీకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఎన్ని సమస్యలు వచ్చినా ఎన్ని ఇబ్బందులు వచ్చినా పార్టీని వీడమన్నారు. పులివెందులలో కొంతమంది లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికలలో అన్ని వార్డులు క్లైవసం క్లైవసం చేసుకొని వైకాపా జెండా ఎగరవేస్తామన్నారు. పులివెందులలో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వస్తున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేమ్ బోర్డు ను సరి చేశారు సవరించుకున్నారు (ప్రజా భూమి వార్త స్పందన)






ప్రజా భూమి ముద్దనూరు

స్థానిక స్టేట్ బ్యాంక్ వెనక భాగాన, హౌసింగ్ కార్యాలయం సమీపంలో ఉన్న ఉప వ్యవసాయ కార్యాలయానికి గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రంగా నామకరణం చేశారు. అయితే ప్రస్తుతం రాష్ట్ర ఉమ్మడి ప్రభుత్వం పరిపాలన పరిధిలోకి రాగానే రైతు భరోసాగా నామకరణం అయినా ఆ కార్యాలయాలకు రైతు సేవా కేంద్రంగా పేరు మార్చింది. అయితే అధికారులు గత ప్రభుత్వం పేరు తోనే ఆ కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా ఈనెల 22వ తేదీన,ప్రజా భూమి పత్రిక,లో ఇది రైతు భరోసా కేంద్రమా రైతు సేవా కేంద్రమా అనే వార్త రావడంతో వెంటనే స్పందించిన వ్యవసాయ అధికారులు రైతు భరోసా కేంద్రా న్ని, రైతు సేవా కేంద్రంగా సవరణ చేశారు. స్పందించిన అధికారు లకు మండల ప్రజా భూమి పత్రికా ప్రతినిధి అధికారులకు పత్రికా ముఖంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఉచిత మెగా మెడికల్ క్యాంప్



ప్రజాభూమి, ప్రొద్దుటూరు:

పట్టణంలో సైదా గారి వీధిలో మన ప్రజా సేవా సమితి కార్యాలయం నందు సద్భావన సేవా సంఘం మరియు మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ %డ% మన ప్రజా సేవా సమితి సంయుక్తంగా కలిసిఉచిత మెగా మెడికల్ క్యాంపులో ముఖ్య అతిథి మాజీ మున్సిపల్ చైర్మన్ వి.ఎస్.ముక్తియార్ మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రజాక్, డాక్టర్స్ నాగ రవీంద్ర శ్రావణ్ కుమార్, శ్రీకాంత్, షమనాజ్, కరిముల్లా షా ఖాద్రి, భారత్ ల్యాబ్ టెక్నీషియన్స్ ఇబ్రహీం ఖాసిం పాల్గొన్నారు. ఉచిత మెడికల్ క్యాంపులో 200 మంది ఉచితంగా పరీక్ష చేసి మరియు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం.మన ప్రజా సేవ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎండి అయూబ్ ఖాన్ గౌరవ అధ్యక్షులు గజ్జల వెంకటేశ్వర్ రెడ్డి. సద్భావన సేవా సంఘం అధ్యక్ష కార్యదర్శులు అల్లాబకాష్. శేఖర్. సభ్యులు లక్ష్మిరెడ్డి. కింగ్ బాషా. మహమూద్. ఫరాన్. యూసుఫ్ మెడికల్ క్యాంపు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చెన్నారెడ్డి పల్లెలో సి,సి రోడ్డు పరిశీలన



ప్రజా భూమి ముద్దనూరు

మండలం పరిధిలోని చెన్నారెడ్డిపల్లెలో సోమవారం ఉపాధి హామీ పథకం కింద 20 లక్షల రూపాయల నిధులతో మంజూరైన సిమెంటు రోడ్డు నిర్మాణం పూర్తయి క్యూరింగ్ లో ఉన్న ఈ రోడ్డును ఎంపీడీవో అలవలపాటి ముకుంద రెడ్డి పరిశీలించారు. అలాగే గుత్తేదారుల ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 21 రోజులు వరుసగా ప్రతిరోజు క్యూరింగ్ చేస్తూ ఉండాలన్నారు. అప్పుడే రహదారి దృఢంగా ఉంటుంది అన్నారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ ముని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దిగువ పల్లెలో వృద్ధుడి దారుణ హత్య



ప్రజాభూమి పులివెందుల(లింగాల)

లింగాల మండలం దిగువపల్లి గ్రామంలో పప్పూరు గంగిరెడ్డి (73) అనే వృద్ధుడిని గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు దిగువపల్లి గ్రామానికి చెందిన పప్పూరు గంగిరెడ్డి తెల్లవారు జామునే తన వ్యవసాయ పొలంకు పని నిమిత్తం వెళ్లిన గంగిరెడ్డిని గుర్తు తెలియని వ్యక్తులు వేట కొడవళ్లతో నరికి హత్య చేసినట్లు భావిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గంగిరెడ్డి హత్యకు భూ సమస్యలా ? వేరే ఏమైనా కారణం ఉందా పోలీసు విచారణలో తేలనుంది. గంగిరెడ్డి మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రెడ్డి సంఘం ఆధ్వర్యంలో కాలినడకన వెళ్లే శివ స్వాములకు అల్పాహారం



ప్రజాభూమి మార్కాపురం

మార్కాపురం రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో మార్కాపురం గుంటక సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మార్కాపురం నుండి శ్రీశైలం కాలినడకన వెళ్ళు శివ స్వాములకు శివ భక్తులకు అల్పాహారం వాటర్ బాటిల్స్ పండ్లు పంపిణీ చేయడం జరిగింది.అని ఆయన అన్నారు అలాగే ప్రతి సంవత్సరం శివ భక్తులకు.రెడ్డి సేవ సంఘం తరపున భక్తులకు అల్పాహారము మరియు పండ్లు ఏర్పాటు చేస్తున్నామని అని ఆయన అన్నారు ఎంతో దూరం నుండి కాలినడకన వస్తున్న భక్తులకు అల్పాహారం అందజేయడం మాకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందని ఈ సందర్భంగా ఆయన అన్నారుఈ కార్యక్రమానికి సహకరించిన దాతలు. మారంరెడ్డి.శ్రీనివాస్.రెడ్డి(కరాటే)10,000,చందులూరి సత్యనారాయణ.రెడ్డి సత్యం 6000, గుండా రెడ్డి శ్రీనివాస్ రెడ్డి సాఫ్ట్ వేర్ అయ్యవారిపల్లె 5000, డాక్టర్ సాని కొమ్ము అశోక్ రెడ్డి 5000 , మాలపాటి వెంకటరెడ్డి మొద్దు 5000 ఇచ్చారు. వారికి రెడ్డి సంక్షేమ సేవా సంఘం తరఫున ధన్యవాదాలు తెలియజేసుకుంటూ వారికి వారి కుటుంబ సభ్యులకు పరమేశ్వరుడు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని కోరుకుంటున్నాం.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు తిరుమల రెడ్డి రామిరెడ్డి,మండల అధ్యక్షులు కుందూరు రమణారెడ్డి, కర్ణ వెంకట నరసింహారెడ్డి, గుంటక భాస్కర్ రెడ్డి, డి.వెంకటేశ్వర రెడ్డి, చిట్టి రెడ్డి నరసింహారెడ్డి,గోగిరెడ్డి వెంకట నారాయణరెడ్డి ,గొగిరెడ్డి కాశిరెడ్డి ,బట్టగిరి లక్ష్మిరెడ్డి ,బట్టగిరి రంగారెడ్డి, ఎస్ వి రమణా రెడ్డి, కె పిచ్చిరెడ్డి కె సుబ్బారెడ్డి ఏ హనుమారెడ్డి అరె రెడ్డి సంఘం సభ్యులు సోదరులు పాల్గొన్నారు.

## గుడ్ సమారటిన్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



ప్రజాభూమి మార్కాపురం

మార్కాపురం వేసవిలో రహదారి వెళ్లే వారి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు గుడ్ సమారటిన్ సర్వీస్ సొసైటీ ఫౌండర్ ఎనిబెర మోష తెలిపారు. సోమవారం మార్కాపురం పట్టణంలోని కొండేపల్లి వెళ్లే బ్రిడ్జి వద్ద ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి కమిటీ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వేసవిదృష్ట చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన గుడ్ సమరిటన్ సర్వీస్ సొసైటీ ఫౌండర్ ఎనిబెర మోష ను వారు అభినందించారు. ప్రతిరోజు 200 లీటర్ల కూలింగ్ మినరల్ వాటర్ ను అందుబాటులో ఉంచుతామని మోష వెల్లడించారు. అంతేకాకుండా రహదారి వెంట వెళ్లే చిన్నారులు, వృద్ధులను, హాస్పటల్ కి వెళ్లే వారిని దృష్టిలో ఉంచుకొని ముందు రోజుల్లో మజ్జిగ వంటివి ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చ్ ట్రెజరర్ రామ స్వామి, వైస్ ప్రెసిడెంట్, గుర్రం ఆర్థర్, కౌన్సిలర్లు దొ నా దో కో ల కరిముల్లా, ఎం ఉత్తమ్ కుమార్, దారువేముల హర్షిత బాబీ, చర్చి సభ్యులు టీఎస్ జయపాల్, కె జాన్ వినయ్ కుమార్, బూదాల పాల్ మనోహర్, పుప్పాల దేవానంద్ రావు, కోలా జాన్ బాబు ప్రసాద్, విజయ్, ఖాజా, నాయబ్ రసూల్, జన్నపోగు విజయ్ కుమార్, జన్నపోగు రాజేంద్ర, తూంపాటి నాగరాజు, ఎనిబెర రాజ్ కమల్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published and owned by A.RAMAMOHANREDDY, Printed at Mohaneeswar Publications, D.No.30-251,WARDNO.4,BUDDAYAPALLY VILLAGE, CHINNACHOWK, YSRDISTRICT-516002, ANDHRAPRADESH.and Published from D.No.30-251,WARDNO.4,BUDDAYAPALLY VILLAGE, CHINNACHOWK, YSRDISTRICT-516002, ANDHRAPRADESH Editor :A.RAMAMOHANREDDY,CELL: 9502116677